
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 26 డిసెంబర్ 2022



వెలిగల్లు నుంచి 200 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి గాలివీడు

వెలిగల్లు ప్రాజెక్టు నుంచి 200 క్యూసెక్కుల నీటిని పాపాగ్ని నదిలోకి విడుదల చేసినట్లు ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సాంబశివుడు పేర్కొన్నారు. పైప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నంతో నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోందన్నారు. ఆది వారం ఒక గేట్ ద్వారా 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టులోకి నీటి ఇన్‌ఫ్లో ఎక్కువ శాతం ఉంటే నీటిని కిందకు విడుదల చేస్తూ ఉంటామన్నారు. నీటి సామర్థ్యాన్ని బట్టి పెంచడం, తగ్గించడం ఉంటుందన్నారు.


గేట్ ఎత్తడంతో పాపాఘ్ని నదిలోకి వెలుతున్న నీరు

క్రిస్మస్ వేడుకల్లో సిఎం జగన్


పులివెందుల సిఎస్ఐ చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న సిఎం జగన్, కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మూడు రోజుల జిల్లా పర్యటనలో ఆదివారం పులివెందులలోని సిఎస్ఐ చర్చిలో తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థన కూటమిలో జగన్ పాల్గొన్నారు. అనంతరం సిఎస్ఐ చర్చిలో తల్లి విజయమ్మతో కలిసి క్రిస్మస్ కేకు కట్ చేశారు. జగన్‌కు తల్లి విజయమ్మ కేక్‌ను తినిపించారు. సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ప్రార్ధనా కూటములు ముగిసిన అనంతరం చర్చిలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ పండుగ వేడుకలో పాల్గొన్న జగన్ బంధువులు, స్నేహితులు, ఆప్తులు, అభిమానులకు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ రోజున ప్రతి ఏడాది తన సొంత గడ్డపై ఇదే చర్చిలో కుటుంబ సభ్యులు, బంధుగణం, స్నేహితులతో కలిసి పండుగ వేడుకలో పాల్గొనడం తన మనసుకు ఎంతో ఆనందాన్నిచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జగన్ సతీమణి వైఎస్.భారతి, తల్లి విజయమ్మ, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్.భాస్కర్‌రెడ్డి, వైఎస్.ప్రకాశ్‌రెడ్డి, భారతమ్మ, సత్యవతమ్మ, మాధవీలత, ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాధ్‌రెడ్డి,కలెక్టర్ వి.విజయ్ రామరాజు, ఎస్‌పి అన్బురాజన్, ఏఎస్పీ తుషార్ డూడీ, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పాల్గొన్నారు. సిఎస్ఐ చర్చిలో ప్రార్థనా కూటములు ముగించుకొని భాకారపురం హెలిప్యాడ్ నుంచి కడపకు చేరుకుని ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

632.8 కిలోల గంజాయి ధ్వంసం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కొంత కాలంగా 44 కేసులకు సంబంధించి 632.08 కిలోల గంజాయిని ధ్వంసం చేసినట్లు ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని శెట్టివాండ్ల పల్లి రోడ్డు మార్గంలో ఉన్న డంపింగ్ యార్డ్‌లో పట్టుబడిన గంజాయిని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిపి ఆదేశాల మేరకు కొన్ని రోజులుగా స్వాధీనం చేసుకున్న గంజాయిని ధ్వంసం చేశామని తెలిపారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా కింద పోలీసులు అన్ని రకాల చర్యలు చేపట్టారన్నారు. 44 కేసులకు సంబంధించి 632.08 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని దీని విలువ సుమారు రూ.94,81,200 ఉంటుందని, దీన్ని పూర్తిగా అగ్నికి ఆహుతి చేశామన్నారు. గంజాయి యువత పట్ల దుష్ప్రభావం చూపుతాయని, యువత చెడు వ్యసనాల ద్వారా బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ గంజాయి నుండి సమాజాన్ని కాపాడుకోవాలన్నారు. ఎక్కడైనా గంజాయి అక్రమ రవాణా, గంజాయి వాడడం వంటి సమాచారం పోలీసులకు అందించాలని పేర్కొన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.


గంజాయికి నిప్పుపెడుతున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ రాజ్ కమల్, డిఎస్‌పి శ్రీధర్, శ్రీనివాసరావు, సిఐలు, ఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.చంద్రశేఖర్‌రెడ్డి



ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో వినియోగదారులకు, రైతులకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ లక్ష్యమని జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటైన అన్నమయ్య జిల్లాలో గృహాలకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఎలా ఉంది, విద్యుత్ బిల్లుల వసూళ్లలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో ఇఇ, డిఇ కార్యాలయాలు ఎన్ని ఏయే ప్రాంతాల్లో ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా 4 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 11 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ కార్యాలయాలున్నాయి. ఎగ్జిక్యూటివ్ కార్యాలయాలు రాయచోటి, రాజంపేట, మదనపల్లె, పీలేరులలో ఉన్నాయి. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాలు రాయచోటి 3, పీలేరు 2, మదనపల్లె 3, రాజంపేట 3 కార్యాలయాలున్నాయి. సెక్షన్స్ 40, ఇఆర్ఎస్ 4, సబ్ ఇఆర్ఒఎస్ 5 , ఎ/సి సెగ్మెంట్స్ 6, పి/సి సెగ్మెంట్స్ 1, మండలాలు 30 ఉన్నాయి.

విద్యుత్ సర్వీసులు ఎన్ని ఉన్నాయి ?

జిల్లాలో గృహాలకు 467431, వ్యాపార కోసం 45,725, పరిశ్రమలకు 2826, ఆర్‌డబ్ల్యూఎస్‌కు 18,530, వ్యవసాయానికి 1,26,716, పెద్ద పరిశ్రమల కోసం 139 సర్వీసులున్నాయి.

జిల్లాలో సబ్ స్టేషన్‌లు ఎన్ని ఉన్నాయి ?

జిల్లా వ్యాప్తంగా సబ్ స్టేషన్లు 220 కెవి 3, విద్యుత్ తీగలు 384, 132 కెవి 10, విద్యుత్ తీగలు 503.9, 33 కెవి 183, విద్యుత్ తీగలు 2115.95, డిటీఆర్/11 కెవి 84729 ,విద్యుత్ తీగలు 14,444.67 ఉన్నాయి. ఇంకా 13 సబ్ స్టేషన్ల కోసం ప్రతిపాదనలు పెట్టాం.

జగనన్న కాలనీలలో విద్యుదీకరణ పనులు ఎలా ఉన్నాయి.?

జిల్లాలో 532 లేవుట్లు ఉన్నాయి. జగనన్న కాలనీలలో విద్యుత్ పనులు చేపడుతున్నాం. పెద్దపెద్ద లేవుట్లు పనులు పూర్తి జరగాలంటే కొంత సమయం పడుతుంది. లేవుట్లులోని లబ్ధిదారులకు డిపాజిట్ లేకుండా ఉచితంగా సర్వీసులు ఇస్తున్నాం. సర్వీసుతో పాటు బోర్డు మీటరు, స్విచ్ 1, హోలర్ 1, ఎత్తు పైపు ఉచితంగా సరఫరా చేస్తున్నాం.

వ్యవసాయ (స్మార్ట్) మీటర్లు ఎన్ని ఏర్పాటు చేశారు ?

జిల్లా వ్యాప్తంగా స్మార్ట్ మీటర్లును పరిశీలించడానికి రాయచోటి నియోజకవర్గంలో రాయచోటి గ్రామీణ, రామాపురం, లక్కిరెడ్డిపల్లి, రాజంపేట నియోజకవర్గంలో సుండుపల్లి, వీరబల్లి మండలాల్లో సర్వే చేపట్టాం. మీటర్లుకు కంపెనీ వారు పదేళ్ల గ్యారెంటీ కూడా ఇస్తారు. త్వరలో జిల్లా మెత్తం సర్వీసు ఏర్పాటు చేస్తాం. అపోహలు నమ్మకుండా మీటర్లు రైతులు ఏర్పాటు చేసుకోవచ్చు.

విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

ప్రమాదాలను అరికట్టేందుకు పాడైన స్తంభాలు, చిన్నవి, విద్యుత్ తీగలను డిపార్ట్‌మెంట్ ఖర్చుతో మరమ్మతులు చేపడుతున్నాం. వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు విద్యుత్ పరికరాలను తాకరాదు. ప్రజలకు అవగామన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం.

జగన్ పాలనలో నాడు ముద్దులు.. నేడు గుద్దులు

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలనపై పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి మండిపడ్డారు. 'జగన్ పాలనలో నాడు ముద్దులు..నేడు గుద్దులు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు అవ్వ తాతల తలరాతలు మారుస్తానని చెప్పి ఇప్పుడు వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఆదివారం పట్టణంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్.అల్లబకాష్‌తో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే రూ.3 వేలు పింఛన్ ఇస్తానని చెప్పడంతో అవ్వతాతల నమ్మి ఓట్లు వేసి గెలిపించాకా, అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కావస్తున్నా రూ.2500 ఇస్తున్నారున్నారు. అంతటితో ఆగకుండా రకరకాల షరతలతో 4 లక్షల మందిని వృద్దులు, వితంతువులు, విభిన్నప్రతిభావంతులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు తీసేసారన్నారు. ఇంటికి ఒక మహిళకు పింఛను సౌకర్యం అనే నినాదంతో అనేక కుంటుంబాలలో చిచ్చు పెడుతున్నారున్నారు. ఒక ఇంటిలో అత్త వయస్సు 70 ఏళ్లు, కోడలు వితంతువు ఉంటారని, వారి మధ్య చిచ్చులు పెడుతున్నారుని విమర్శించారు. ఇంటికి ఒక్కరికీ అనే షరతును తొలగిచ్చి అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డికి 175 అసెంబ్లీ స్థానాలు కాదని కేవలం 13 స్థానాలు వస్తేనే గొప్ప విషయమని జోస్యం చెప్పారు. చిన్నాన కూతురు సునీత, సొంత చెల్లెలు షర్మిలకు న్యాయం చేయలేని నీవు రాష్ట్రానికి ఏమి న్యాయం చేస్తావని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతులు, రైతు కూలీలు, భవన కార్మికులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలను మోసం చేశాడన్నారు. వచ్చే ఎన్నికలల్లో జగన్ తల కింద పెట్టి తలకిందులు చేసినా అధికారంలోకి రాలేడని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎపిసిసి డెలిగేట్ ఎస్‌ఎండి.మహమ్మద్ గౌస్, రాష్ట్ర మైనారిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ రఫీ, కిసాన్ జిల్లా అధ్యక్షులు చెన్నకృష్ణ, పిసిసి ఆర్గనైటెడ్ ఆర్గనైజర్ సెక్రెటరీ మహబూబ్ బాషా, ఖదీర్, రమణమ్మ, నాగలత, నాగయ్య, మహబూబ్ జాన్, రాందాస్, ఉత్తన్న పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.తులసిరెడ్డి


సన్మాన గ్రహీతలతో మానవత సభ్యులు

'సృష్టిలో మానవత్వాన్ని మించిన మతంలేదు'

ప్రజాశక్తి - రాయచోటి

సృష్టిలో మానవత్వాన్ని మించిన మతం లేదని వైసిపి మైనార్టీ నాయకులు బెపారీ మహమ్మద్ ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రతిభ జూనియర్ కళాశాలలో రాయచోటి మానవతా చైర్మన్ రెడ్డి ఆధ్వర్యంలో నెలవారి సమావేశం నిర్వహించారు. కళాశాల అధ్యక్షులు కనపర్తి శివశంకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి మహమ్మద్ ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫాయాజుర్ రహమాన్, గున్నికుంట్ల, గురిగుంజకుంట ఎంపిటిసి శ్రీధర్‌రెడ్డి, విశ్రాంత లెక్చరర్లు రహంతుల్లా, రెడ్డిమునిస్వామి హాజరయ్యారు. సంబేపల్లె మండలం గురిగింజకుంట హరిజనవాడకు చెందిన ఆదర్శ రైతు రెడ్డయ్యను మానవత సంస్థ అధ్వర్యంలో శాలువాతో సన్మానించి రూ.5,016 నగదుతో పాటు మానవత మెమొంటోను అతిథులు అందజేశారు. అతిధులుగా హాజరైన వారికి మానవత కుటుంబ సభ్యులు శాలువాతో సన్మానించి మానవత మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా దాతల సహకారంతో వివిధ రకాల ఉచిత సేవలు అందజేయడం చాలా హర్షించదగ్గ విషయమన్నారు. మానవత సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి ఒక ఉన్నతమైన ఆశయంతో సంస్థను ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా సేవలు అందజేయడం చాలా గొప్ప విషయమన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా వివిద రకాల ఉచిత సేవలు అందించేందుకు బేపారి మహమ్మద్ ఖాన్ రూ.30 వేలు, ఎంపిటిసి శ్రీధర్‌రెడ్డి రూ.25 వేల నగదును మానవత కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులో కూడా ఈ సంస్థకు సహాయ సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సంచుల ఖాదర్‌బాషా, మానవత జిల్లా డైరెక్టర్ బ్రహ్మానంద రెడ్డి, సెక్రెటరీ వెంకట్రామరెడ్డి, గౌరవ సలహాదారుడు వెంకటరమణ,కేంద్ర కమిటీ సహదేవరెడ్డి, మాజీ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, మానవత సభ్యులు శ్రీధర్ రెడ్డి, మహబూబ్ బాషా, చిన్న, రవి మురళి, గంగాధర్‌రెడ్డి, తాతిరెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపుపై 27న ఆందోళన

కడప అర్బన్: నగరంలో సామాజిక పెన్షన్లను లబ్ధిదారుల సంఖ్యను కుదింపు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 27న ఉదయం 10 గంటలకు కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేయనున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి ఎ రామమోహన్ తెలిపారు. ఆదివారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2023, జనవరి 1 నుంచి పెన్షన్ మొత్తాన్ని రూ.2500 నుంచి రూ. 2750 వరకు పెంచడాన్ని తమ పార్టీ హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. కానీ పెంచిన మొత్తాన్ని గతంలో ఉన్న లబ్ధిదారులందరికీ వర్తింప చేయకుండా లబ్ధిదారుల సంఖ్యను కుదించే ప్రయత్నం సమంజసం కాదన్నారు. పెన్షన్ పొందుతున్న వారిలో వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, ఇతర కేటగిరీలకు చెందిన వారు ఉన్నారని వారందరూ ఉన్నారని చెప్పారు. ఇలాంటి సామాన్య ప్రజల పెన్షన్ ఆగిపోవడం వల్ల ఆర్థికంగా తీవ్ర కష్టాలు పడే ప్రమాదం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల సంఖ్యను కుదించాలనే ప్రయత్నాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా చితికిపోయి ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ మీదనే ఆధారపడి జీవిస్తున్న ప్రజల బాధలు ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. లబ్ధిదారుల సంఖ్యను కుదించాలనే ప్రయత్నాలు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మానుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలో ప్రతి వార్డులో 60 నుంచి 100 దాకా పెన్షన్లలో కోత కోశారని, దీనివల్ల ప్రజల ఆర్థిక పరిస్థితుల మీద తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్క పెన్షన్ను తొలగించిన సిపిఎం చూస్తూ ఊరుకోదని, పోరాటం చేస్తుందని హెచ్చరించారు. అందులో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట జరిగే ఆందోళనలో ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పోరాటం కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళనతో ఆగదని జనవరిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించి ప్రజానీకాన్ని కూడగట్టే ప్రయత్నం చేస్తామని తెలిపారు. నగర ప్రజానీకం పెన్షన్ల తొలగింపుకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో నగర కార్యదర్శి వర్గసభ్యులు చంద్రారెడ్డి, కమిటీ సభ్యులు ఓబులేసు, ఎమ్మార్ నాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ హాకీ క్రీడాకారులు

హాకీ క్రీడను నాశనం చేస్తున్న స్వార్థపరులు

- సీనియర్ హాకీ క్రీడాకారుడు వై.గురుభాస్కర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

హాకీకి పుట్టినిల్లు అయిన మదనపల్లెలో కొంత మంది స్వార్థపరుల స్వార్థనికి హాకీ సర్వనాశనం అయిపోయిందని సీనియర్ హాకీ క్రీడాకారులు వై.గురు భాస్కర్, రెడ్డిప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం బిటి కళాశాల మైదానంలో హాకీ క్రీడాకారులు వై.గురు భాస్కర్, రెడ్డి ప్రసాద్, ఉమేష్, అగస్సీ, గంగాధర రెడ్డి, మైత్రేష్ సాయి అనిల్ కుమార్, మణీష్ తేజ సమావేశమై హాకీ క్రీడాకారులకు జరుగుతున్న అన్యాయాన్ని విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురు ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు లేని హాకీ అసోసియేషన్ పలువురు క్రీడాకారులు జీవితాలతో చలగాటం పడుతోందని విమర్శించారు. గుర్తింపు లేని ఈ అసోసియేషన్ ద్వారా రాష్ట్ర, జిల్లా స్థాయి హాకీ క్రీడలో క్రీడాకారులు పాల్గొని మోసపోవద్దని క్రీడాకారులకు సూచించారు. క్రీడాకారులకు ఉపయోగపడని సర్టిఫికెట్స్ ఇస్తున్నారని వెల్లడించారు. రాష్ట్ర క్రీడా సంస్థ శాఖ 2019-2022 వరకు హాకీ ఆంధ్రప్రదేశ్‌కు శాప్‌లో గుర్తింపు లేదన్నారు. ఈ మద్య కాలంలో హాకీ క్రీడాకారుడకు ఇచ్చిన జిల్లా సర్టిఫికెట్స్, రాష్ట్ర సర్టిఫికెట్స్ చెల్లవని శాప్ తెలియజేసిందన్నారు. శాప్ ఇచ్చిన ఆర్టిఐ యాక్ట్ సమాచారం జత చేసి క్రీడాకారుల ఎడ్యుకేషన్ అడ్మిషన్ హాకీ ఆంధ్రప్రదేశ్ ఇచ్చిన సర్టిఫికెట్స్ హాకీ క్రీడాకారులకు చెల్లవని, మెరిట్ లిస్టులో చూపించిన కోర్టు కాపీలు తమ వద్ద ఉన్నాయన్నారు. హాకీ క్రీడలు ఎవరి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. హాకీ టోర్నమెంట్ల పేరుతో క్రీడాకారులను, క్రీడా అభిమానులను, పెద్దలను మోసం చేస్తూ చందాలు వసూలు చేస్తున్నారని, వారి మాటలు నమ్మి హాకీ క్రీడాకారుల అభిమానులు, ప్రభుత్వ అధికారులు ఎవరు కూడా సహాయం చేయవద్దన్నారు. కొంత మంది స్వార్ధ ప్రయోజనాలకు హాకీ క్రీడాకారును బలి చేస్తున్నారని, ఇప్పటికే ఎంబిబిఎస్, ట్రిపుల్‌ఐటి, తదితర వాటిలో స్పోర్ట్స్ కోట కింద హాకీ అసోసియేషన్ ఇచ్చిన సర్టిఫికేట్లు చెల్లలేదని తెలియజేశారు. ఈ అసోసియేషన్ ఇచ్చిన సర్టిఫికేట్లుపై కోర్టుకు వెళ్ళడం జరిగిందని పేర్కొన్నారు. మరోవైపు సిఐడి, సిబిఐ దర్యాప్తు కూడా జరుగుతోందని వివరించారు. గతంలో కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు ప్రకాశం జిల్లాలతో అసోసియేషన్ ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొంది జాతీయ స్థాయిలో సెమి ఫైనల్స్ వరకు జట్టు తీసుకువెళ్ళిన విషయాన్ని గుర్తు చేశారు. కొంత మంది గుర్తింపు లేని అసోసియేషన్లతో చేస్తున్న మోసాలపై క్రీడా శాఖ ఉన్న అధికారులు, శాప్ అధికారులు స్పందించి హాకీ క్రీడాకారులను మోసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - రాయచోటి

స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ గిరీష ఆదివారం ఒక ప్రకనటలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్పందనకు వ్చచిన అర్జీలకు సంబంధించిన పరిస్కారాలు ఎన్ని చేశారనే వివరాలతో అధికారులు రావాలన్నారు. అన్ని శాఖల అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.


వీరాంజనేయ ప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

తొగట వీర క్షత్రియ సంఘాన్ని బలోపేతం చేద్దాం

- రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్

ప్రజాశక్తి - సుండుపల్లి

తొగట వీర క్షత్రియ సంఘాన్ని అందరం ఐక్యంగా బలోపేతం చేద్దామని తొగట వీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్ అన్నారు. ఆదివారం రాయచోటి సంఘం కార్యాలయంలో సుండుపల్లి మండల నూతన కమిటీని నియమించారు. కమిటీ అధ్యక్షులుగా బొమ్మిశెట్టి రెడ్డప్ప, ఉపాధ్యక్షులుగా రెబ్బా తిరుమయ్య, బోజనపు సురేంద్ర, ముదిసెట్టి దనసేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పెద్దకోట్ల వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా గుదిటి రవి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు బోజనపు వెంకట నారాయణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మోడెం వీరాంజనేయ ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు సంఘం బలోపేతానికి తమ పరిధిలో శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఎప్పుడూ తమ సహాయ సహకారాలు ఉంటామని పేర్కొన్నారు. కులస్థుల సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళ అధ్యక్షులు సురువు శ్రీలత, రాష్ట్ర చేనేత సంక్షేమ అధ్యక్షులు కుర్రా వెంకట రమణ, రాయలసీమ అధ్యక్షులు బొమ్మల వెంకట రత్నం, జిల్లా అధ్యక్షులు బోజనపు వెంకట నారాయణ, ఉపాధ్యక్షులు రామిశెట్టి రత్నమయ్య, సలహాదారు సహదేవయ్య, ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిట్టెం రామచంద్ర, అనంతపురం జిల్లా అధ్యక్షులు బండి శ్రీనివాసులు, ప్రధాకార్యదర్శి చింతా కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు సాయి ప్రసాద్, తిరుపతి జిల్లా అధ్యక్షులు మందపల్లి బాబు, ప్రధాకార్యదర్శి చిన్న రెడ్డి, కోశాధికారి వెంకట రత్నం, చిత్తూరు జిల్లా అధ్యక్షులు పురం మల్లయ్య, ప్రకాశం జిల్లా రాష్ట్ర సభ్యులు పల్లా మాలకొండ రావు, రాయచోటి వైసిపి బిసి ప్రధాన కార్యదర్శి సిబ్యాల విజయ భాస్కర్, లక్కిరెడ్డిపల్లి టివికె అధ్యక్షులు దండే శ్రీనివాసులు, రామాపురం అధ్యక్షులు బొమ్మి సెట్టి వెంకటరమణ, గాలివీడు మండల టివికె అధ్యక్షులు మోడెమ్ చెంద్రాయుడు, వీరబల్లి మండల వైస్ ఎంపిపి మోడెమ్ నాగభూషణం, మండల వైస్ ఉపాధ్యక్షుడు వేల్పుల ఆంజనేయులు, మందపల్లి వెంకట సుబ్బరాయుడు, మోడెం మల్లిఖార్జున, చౌడయ్య, వెంకటేష్, సుండుపల్లి మండల కార్యవర్గ సభ్యులు గుదిటి రెడ్డయ్య, గాలి నాగయ్య, బోల్లు చంద్రశేఖర్, రాయని ప్రసాద్, బొమ్మిసెట్టి ఆంజనేయులు, బండి నారాయణ, మందపల్లి రెడ్డయ్య, గౌరవ సలహాదారులు, మాజీ ప్రెసిడెంట్ గుండ్లపల్లి రామచంద్ర, మందపల్లి వెంకటేష్ ,పురం రెడ్డి లక్ష్మి నారాయణ, రిబ్బా శివయ్య పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన ఖాదర్‌బాషా

ప్రజాశక్తి - రాయచోటి

ముస్లింలను మోసగించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని లోకేష్ బాబు స్వగృహంలో కలిసి ఆయనతో మైనార్టీల సమస్యలపై టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. మైనార్టీ ఓట్లతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి మైనార్టీలపై దాడులు చేస్తున్నారన్నారు. మరొక పక్క హత్యలు చేస్తున్నారున్నారు. దీనిపై పెద్ద ఎత్తున అందరూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని లోకేష్ సూచించారని చెప్పారు. జగన్ పాలనలో రాష్ట్రం నాశనం అయిపోయిందని రాష్ట్రంలో ఎటు చూసినా దోపిడి పరిపాలన సాగిస్తున్నారని జగన్ ప్రభుత్వం పై ప్రజల్లో ఆగ్రహం స్పష్టంగా కనబడుతుందన్నారు. జగన్ టైం అయిపోయిందని ప్రజలే గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. ఏ ముఖ్యమంత్రి చేయని ద్రోహం జగన్‌రెడ్డి ముస్లింలకు చేశారన్నారు.ప్రతి నియోజకవర్గంలో ఇంటింటికి వెళ్లి ముస్లింలపై జరుగుతున్న దాడులు ముస్లింలపై జరుగుతున్న హత్యలు నేరాలను వివరించాలని సూచించారన్నారు. సమావేశంలో కడప నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి అమీర్ బాబు పాల్గొన్నారు.

నూతన సంవత్సరానికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-పీలేరు

నూతన సంవత్సరం సందర్భంగా తీర్థయాత్రలు, విహారయాత్రలు చేయాలనుకునే వారి కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పీలేరు ఆర్టీసీ డిపో మేనేజర్ బండ్ల కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2023 జనవరి 1న తీర్థయాత్రకు వెళ్లాలనుకునే భక్తుల కోసం ఉదయం 6.30 గంటలకు కల్లూరు మీరుగా సదుం యర్రాతివారిపల్లెలోని అయ్యప్పస్వామి, తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయాల దర్శనానికి, అలాగే హార్సిలీ హిల్స్ విహారయాత్ర చేయదలచిన వారి కోసం అదేరోజు ఉదయం 7 గంటలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఎం కోరారు. మరిన్ని వివరాల కోసం 9959225679, 7382880860 సెల్ నెంబర్లకు కాల్ చేయాలని తెలియజేశారు.

బంజారాలు ఐక్యంగా ముందుకెళ్లాలి

- విశ్రాంత అడిషనల్ డిజిపి డాక్టర్ డి.టి.నాయక్

ప్రజాశక్తి - కడప అర్బన్

బంజారాలు ఐక్యంగా ముందుకు నడవాలని విశ్రాంత అడిషనల్ డిజిపి డాక్టర్ డి.టి.నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం వైఎస్ఆర్ ఆడిటోరియంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆంధ్రప్రదేశ్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయనతోపాటు ఎస్. చిన్న రాముడు, జాతీయ నాయకులు హరిలాల్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తండాలలో అవగాహన కల్పించి బంజారాలు బాగా చదువుకుని రాజకీయంగా ఆర్థికంగా ఎదిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. చదువు కుని మంచి ఉద్యోగాలలో ఉన్నవారు తండాలు తిరిగి చదువుకోని వారికి సహకారం అందించాలని కోరారు. ఇటీవల ఇతర అభివృద్ధి చెందిన కులాలు గిరిజనులలో చేరాలని చూస్తున్నారని, అటువంటి వాటికి అవకాశం ఇవ్వకుండా అందరు ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ నుంచి నూతన సభ్యులను ఎన్ను కున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా నంద్యాల జిల్లాకు చెందిన ఎస్. వెంకట రమణ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అనంతపురానికి చెందిన ఎం. చక్రి నాయక్, రాష్ట్ర కోశాధికారిగా కడప జిల్లాకు చెందిన డాక్టర్. ఐ. శివా నాయక్‌ను ఎన్నుకు న్నారు. కార్యక్రమంలో ఏం. వెంకట స్వామి నాయక్, గౌరవ అధ్యక్షులు ఏం. శంకర్ నాయక్, జగన్ నాయక్, అర్జున్ నాయక్, వెంకట్ నాయక్, రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్. లక్ష్మ నాయక్, ఒంగోలు డాక్టర్.బాలాజీ నాయక్, అనంతపురం ఠాగూర్ నాయక్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.


కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచిన జట్టు

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలో ఆదివారం నిర్వహించిన కబడ్డీ పోటీలు ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించాయి. ఈ పోటీలలో మండల యువ క్రీడాకారులు తమ సత్తా చాటారు. స్థానిక కబడ్డీ కోచ్ బండి కార్తీక్ బాబు నేతృత్వంలో యువ ఆటగాళ్ల జట్టు ఫైనల్ విజేతగా నిలవడం విశేషం. బి.కొత్తకోట బ్యాడ్ బాయ్స్ కబడ్డీ క్లబ్ ఆటగాళ్లు గిరీష్, ఇటీవల జరిగిన అండర్-19 రాష్ట్ర జట్టుకు ఎంపికైన బాలుడుని, క్లబ్ ఆటగాళ్లను పలువురు అభినందించారు. ఈ పోటీలకు ఉస్మాన్ ఆర్గనైజర్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ క్రీడల్లో మండలంలో అద్భుత ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని అన్నారు. వారికి తగిన ప్రోత్సాహం ఇస్తే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో సత్తాచాటడం ఖాయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామీణ ప్రాంత క్రీడాకారులలో దాగి ఉన్న క్రీడాప్రతిభను వెలికి తీయాలని కోరారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బి.కొత్తకోట


ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. నియోజవర్గం లోని పెద్దతిప్పసముద్రం మండలం, తుమ్మరకుంట సచివాలయ పరిధి లోని గెజ్జలవారిపల్లి, బొమ్మిరెడ్డిపల్లె, కొత్తపల్లి, వరికసువుపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హులందరికీ సకాలంలో అందాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్య లను సులభంగా,వేగంగా పరిష్కరించడానికి గ్రామ సచివాలయాలు దోహద పడుతున్నాయన్నారు. ఇప్పటికే మండలంలో దాదాపు సిసి రోడ్లు, తాగునీటి ట్యాంకులు, మురుగనీటి కాలువల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మహమ్మద్ ఖాన్, జెడ్పిటిసి శివన్న, ఎంపిడిఒ గిరిధర్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్ బాషా, ఉపసర్పంచ్ మధుకర్ రెడ్డి, సర్పంచ్ మంజునాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, మడుమూరు సర్పంచ్ నాగరత్న, భాస్కర్‌నాయుడు, ఎస్ఎస్ ఫయాజ్, సంక సబ్జీ పాల్గొన్నారు.


పాలఏకిరిల జనగణన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

పాలఏకిరిల అభివృద్ధికి కలిసి రావాలి

ప్రజాశక్తి-కలికిరి

పాలఏకిరిల అభివృద్ధి కోసం అందరూ కలిసి రావాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం కలికిరిలో ఏకిరిల సంఘం జనగణన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకిరి సోదరులు చాలా వరకు అక్షరాస్యత లేకపోవడంతో వ్యవసాయ పనులకే పరిమితమై కడు పేదరికంలో జీవనం సాగిస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఎవరికైనా ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా సంఘం సభ్యులను సంప్రదించాలని కోరారు. కార్య క్రమంలో పాల ఏకిరిల సంఘం జిల్లా అధ్యక్షుడు చలపతి, చిత్తూరు జిల్లా అధ్యక్షులు మల్లికార్జున నాయుడు, గౌరవ అధ్యక్షులు బాలిరెడ్డిపరెడ్డి నాయుడు, చలపతి నాయుడు, అంకయ్య నాయుడు, మల్లేష్ నాయుడు, ఎన్.సి రెడ్డెప్ప నాయుడు, మదనమోహన్ నాయుడు, తదితర పాల ఏకిరిల సభ్యులు పాల్గొన్నారు.


అరికెల గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న జయరాం నాయుడు

టిడిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - రామసముద్రం

నియోజకవర్గంలో టిడిపి బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యమని నియోజకవర్గ టిడిపి నాయకులు శ్రీరామనేని జయరాం నాయుడు పేర్కొన్నారు. ఆదివారం మండలంలో విస్తృతంగా పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అరికెల పంచాయతి కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. వైసిపి పాలనపై ప్రజలువిసుగు చెందారని అన్నారు. సుపరిపాలన కోసం టిడిపిని మళ్ళీ అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. టిడిపితోనే సంక్షేమ పాలన అందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి చలపతినాయుడు, మాజీ సర్పంచ్ వెంకటప్ప , సుధాకర్ రెడ్డి, పెంచుపాడు స్వామి, జెవి రమణ, డాక్టర్ శివ, రామాంజులు రెడ్డి ,జనార్దన్ , రెడ్డెప్ప మోహన్, మురళి, నాగభూషణం , గోపి, సాయి కిరణ్ ,ఈవూరి చంద్రబాబు, మదన్ మోహన్‌రెడ్డి, జెల్లా రామచంద్రా , ఐటిడిపి మహేష్ , యుగంధర్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు చలికోట్లు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ముసల్ రెడ్డిపల్లె కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు నాగిరెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కార్యాలయంలో సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఎం కార్యాలయ సహాయ సమన్వయకర్త తొడిమె రఘునాథరెడ్డి , వారి కుటుంబ సభ్యులు, కీ.శే. నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. తర్వాత నాగిరెడ్డి కుటుంబ సభ్యులు టి.వి. రాఘవేంద్రరెడ్డి , చంద్రఓబులరెడ్డి సమకూర్చిన స్వెటర్లను 25 మంది విభిన్న ప్రతిభావంతులకు అందజేశారు. అనంతరం స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నియోజకవర్గం నెట్వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య ఉన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


లక్కిరెడ్డిపల్లె : క్రిస్మస్ సందేశాన్ని బోధిస్తున్న ఫాదర్


బి.కొత్తకోట : చర్చి సభ్యులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న యంగ్ ఇండియా సభ్యులు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో ఆదివారం క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో సామూహిక ప్రార్థనలు చేశారు.

రాజంపేట అర్బన్ : ఒకరినొకరు ప్రేమాభిమానాలను పంచుకోవడమే అసలైన క్రిస్మస్ అని టిడిపి నాయకులు జగన్మోహన్ రాజు పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని భవానినగర్‌లో ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ క్రీస్తు పుట్టినరోజు పండుగ సుఖ సంతోషాలతో ఆనందంగా జరుపు కోవాలని, క్రీస్తు కృపతో శాంతి, సహనం, ప్రేమ సమాజానికి పంచడమే అసలైన క్రిస్మస్ సంబరమని అన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎద్దుల విజయసాగర్, తెలుగు యువత పట్టణ అధ్యక్షులు రాము యాదవ్, మండల ఉపాధ్యక్షులు ఊటుకూరు సతీష్ రాజు, శేషారెడ్డి, సూర్యనారాయణ రాజు, సురేంద్ర, నాగేంద్ర, గురు, పాల్గొన్నారు. **కలకడ :** మండలంలోని కలకడ, గంగిరెడ్డిగారిపల్లి, ఎర్రయ్యగారిపల్లి, దేవులపల్లి, ఎర్రయ్యగారిపల్లికాలనీ, ఎర్రకోటపల్లి తదితర ప్రాంతాల్లో కిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. **నిమ్మనపల్లి :** క్రైస్తవ సోదరులు ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని క్రిస్మస్ పండుగను వెంకోజీగారిపల్లి, నిమ్మనపల్లి, గుండ్లబురుజు, రాచవేటివారిపల్లి, రెడ్డివారిపల్లి, బండ్ల పై, ముష్టూరు, అగ్రహారం, సామకోటవారిపల్లి, వెంగం వారిపల్లి, ఎగువ మాచిరెడ్డిగారి పల్లి, దిగువ మాచిరెడ్డిగారిపల్లి తదితర ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు జయకుమార్, బాబు, రాజు బైబిల్ లోని అంశాలను భక్తులకు బోధించారు. **పెద్దమండ్యం:** మండలం లోని పెద్దమండ్యం, వెలిగల్లు, తురకపల్లి తదితర గ్రామాలల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మండలకేంద్రంలో ఇమ్మానియాల్ చర్చినందు పాస్టర్ ఆశీర్వాదం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమం లో పాస్టర్ ఆశీర్వాదం, చర్చిసభ్యులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** స్థానిక చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో యంగ్ ఇండియా సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా పాస్టర్ జీసస్ జననం,జీవనం,ఆయన చూపిన సన్మార్గం గురించి వివరించారు. సర్వ మానవ సౌభ్రాతృత్వం ఏసుప్రభువు చూపించిన వచనాలను వివరించారు. **రామాపురం :** మండలంలో కిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ఆర్‌సిఎం చర్చి తో పాటుగా లక్కిరెడ్డిపల్లి రహదారిలోనే ఉన్న చర్చిలో అర్ధరాత్రి పూజలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. పశువుల పాక, విద్యుత్ వెలుగులు, శాంటాక్లాస్ వేషధారణ ఆకట్టుకున్నాయి. ఫాదర్లు జాన్సన్ కిస్మస్ ప్రాముఖ్యతను, కీస్తు పుట్టుకను వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. **తంబళ్లపల్లి :** మండలంలోని తంబళ్లపల్లె సిఎస్ఐ చర్చ్ ఉప్పులూరవాండ్లపల్లె, గోపీదిన్నె, చింపిరెడ్డిగారిపల్లె, కుక్కరాజుపల్లె, భద్రయ్య గారి పల్లె, చర్చిలలో క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఫోర్డ్ ప్రతినిధి నరసింహులు, భాస్కర్, రామలక్ష్మి, వసంతమ్మ, రెడ్డమ్మ పాల్గొన్నారు. **గాలివీడు :** కర్మేల్ ప్రార్థన మందిరంలో పాస్టర్ ప్రకాష్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంతో రత్న కుమార్, హాస్టల్ డేవిడ్ రాజు, క్రైస్తవులు పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. **కలికిరి :** పట్టణంలోని చర్చిలలో కిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవ సోదరులు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హిందూ, ముస్లింలంతా మతాలకతీతంగా క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ఆనందోత్సవాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచి తమ ఆప్యాయతను చాటుకున్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మండలంలోని మిస్ప చర్చి, సెయింట్ జోసెఫ్ చర్చి, లూథరన్ చర్చి, మద్దిరేవుల రంగరాజు పలి, దప్పేపల్లి చర్చిలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాస్టర్లు దేవ సహాయం, రాజశేఖర్, విజయ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. చర్చి సభ్యులకు స్వీట్లు పంచి పెట్టారు. **మదనపల్లె అర్బన్ :** జీసస్ చూపిన మార్గం మానవాళికి ఆచరణీయమని మదనపల్లి నియోజకవర్గం టిడిపి నాయకులు శ్రీరామినేని జయరామ నాయుడు పేర్కొన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని మదనపల్లి మండలం కొత్తఇండ్లు చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు ఏసుక్రీస్తు చూపిన సన్మార్గంలో నడవాలని తెలిపారు. 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పెంచుపాడుస్వామి, జెవిరమణ, మదన మోహనరెడ్డి, గోపి, సాయి, కిరణ్, యుగంధర్ నాయుడు,నరసాపురం మహేష్, జల్లా రామచంద్ర, శివకుమార్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఎస్‌బివిడిఎస్ హైస్కూల్లో తిరుపతి రవి న్యూరో ఎమర్జెన్సీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో 190 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరమును విజయవంతం చేయడానికి సహకరించిన హైస్కూల్ కరస్పాండెంట్ నూకల శ్రీరాముని డాక్టర్ల బృందం అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్లు పూర్ణచంద్రరావు, ప్రవీణ్, సుధాకర్, నిర్మల, పురంధర్ స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని రోగులను పరీక్షించారు.

నందలూరు వాకర్స్ క్లబ్‌కు సేవా పురస్కారం

ప్రజాశక్తి-నందలూరు

వాకర్స్ క్లబ్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి నందలూరు వాకర్స్ క్లబ్‌నకు ద్వితీయ ఉత్తమ పురస్కారానికి ఎంపికైంది. వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ శ్యామన బోయిన గురు ప్రసాద్, వాకర్స్ ఇంటర్నేషనల్ చైర్ పర్సన్ కుర్రా మణియాదవ్‌లు ఆదివారం నెల్లూరులో జరిగిన రాయలసీమ, తమిళనాడు, కర్ణాటక, కేరళ ప్రాంతాలకు సంబంధించిన వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ కార్యక్రమం పాల్గొన్నారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 302 గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ కీలక బాధ్యతలతో అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి మంత్రికాకాని గోవర్ధన్ రెడ్డి హాజరయి వాకర్స్ క్లబ్ సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రతినిధులు కొండూరు శరత్ కుమార్ రాజు, డిప్యూటీ గవర్నర్ మన్నెం రామమోహన్, లయన్ అబ్దుల్లా, పాల్గొన్నారు.

వెండిగిన్నె, బంగారు నామం వితరణ

ప్రజాశక్తి -గుర్రంకొండ

మండలంలోని చెర్లోపల్లి పంచాయతీలో వెలసిన రెడ్డమ్మ గుడికి వెండి గిన్నె, బంగారు నామం వితరణ చేశారు. రెడ్డమ్మ కొండ చైర్మన్ నరసింహారెడ్డి మాట్లాడుతూ కడప జిల్లా పోరుమామిళ్ల కు చెందిన అచ్యుతరామయ్య , రెడ్డి జ్యోతి దంపతులు 100 గ్రాములు బరువు గల వెండి గిన్నె ,04 గ్రాముల బంగారు నామం (బొట్టు) అమ్మవారికి కానుకగా అందజేశారని తెలిపారు.

28న చేపల చెరువులకు వేలం

ములకలచెరువు : మండలంలోని పర్తికోట పంచాయతీ పరిధిలోని తిరుమల దేవర చెరువు, దేవలచెరువు, కన్నేమాడువారికుంటలను ఈనెల 28న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ సర్పంచి మనోహ రమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. చెరువులలో చేపలు పెంపకం, అమ్ముటకు వేలం పాట నిర్వహి స్తున్నట్లు తెలిపారు. వేలం పాటల్లో పాల్గొనే వారు ముందుగా డిపాజిట్ రుసుం చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాలని సూచించారు.

ఇంకెన్నాళ్లీ ఎదురుచూపులు..!

పెద్ద గురువలూరు, కుచ్చుపాప నిర్వాసితులకు అందని పరిహారం.. ప్రారంభానికి నోచుకోని వంతెన

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని పెద్ద గురువలూరు-కుచ్చుపాప గ్రామాల మధ్య కుందూ నదిపై నిర్మించిన వంతెన ప్రారంభానికి నోచుకోలేదు. ఈ వంతెనకు సంబంధించి అనుసంధాన రోడ్డుకు భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం మంజూరు చేయకపోవడంతో రైతులు ఎదురు చూస్తున్నారు. 2010 వంతెన నిర్మాణాన్ని ప్రారంభించి 2014 నాటికి పూర్తి చేశారు. అయితే వంతెనకు ఇరువైపులా అనుసంధాన రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో ప్రారంభం కాలేదు. పెద్ద గురువులూరు, చిన్న గురువలూరు, శ్రీరాములపేట, అల్లాడుపల్లె, కుచ్చుపాప, నక్కలదిన్నె, రామసుబ్బమ్మ కొట్టాల వంటి గ్రామాల ప్రజలకు ఈ వంతెన ప్రారంభమైతే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం ఈ గ్రామాల ప్రజలు తాత్కాలికంగా ఈ రోడ్డు వెంబడి ప్రయాణిస్తున్నారు. అనుసంధాన రోడ్డు కోసం ఈ ప్రాంత రైతులు తమ పొలాలను ఇచ్చారు. నష్టపరిహారం మంజూరు చేయడంలో ప్రభుత్వం జాప్యం చేయడంతో పనులు నిలిచి పోయాయి. వంతెనకు ఇరువైపులా దారి కోసం 48 మంది రైతులు 4.72 ఎకరాల పొలాలను ఇచ్చారు. అప్పట్లో ఎకరా రూ.8 లక్షల వరకు విలువ ఉన్న భూములు ఇచ్చినప్పటికీ ఉప యోగం లేకుండా పోయిందని రైతులు వాపో తున్నారు. ప్రస్తుతం ఎకరా విలువ రూ.30 లక్షలు ధర పలుకుతోంది. బూడిదపాడుకు చెందిన 35 మంది రైతులు 3.80 ఎకరాలు, పెద్ద గురువలూరుకు చెందిన ఇద్దరు రైతులు 0.84 ఎకరాలు, కుచ్చుపాపకు చెందిన 11 మంది రైతులు 0.78 ఎకరాల భూములను రైతులు రోడ్డు నిర్మాణానికి వ్యవసాయ భూములను ఇచ్చారు. 2016 నవంబర్‌లో జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమానికి హాజరైన అప్పటి జెసి రామారావుకు బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. స్వయానా జెసి రైతులతో కలిసి వంతెన దారి కోసం ఇచ్చిన పొలాలను పరిశీలించి, పరిహారం ఇప్పించేందుకు ఏర్పాటు చేయాలని ఆర్‌డిఒకు ఆదేశాలు జారీ చేశారు. ఆ తర్వాత బదిలీపై వచ్చిన ప్రతి అధికారి దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ రైతులకు న్యాయం జరగలేదు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించి, రోడ్డు పనులను పూర్తిచేసి వంతెనను ప్రారంభిస్తే ఆయా గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.


ప్రారంభానికి నోచుకొనక నిరుపయోగంగా ఉన్న వంతెన

రైతులకు న్యాయం చేయాలి



వంతెన నిర్మాణానికి సహకరించి, అనుసంధాన రోడ్డుకు భూమిలిచ్చి ఉపాధి కోల్పోయిన రైతు లకు ప్రభుత్వం ఇప్పటికైనా న్యాయం చేయాలి. భూములిచ్చి అన్ని విధాలా నష్ట పోయాం. ప్రస్తుతం భూములు మార్కెట్‌లో ఎకరా రూ.30 లక్షలుగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలి. రోడ్డు నిర్మాణానికి 0.64 ఎకరాలు భూమినిచ్చాను.

- సత్య వేమారెడ్డి, రైతు, పెద్దగురువలూరు

భూములు కోల్పోయి 13ఏళ్లవుతోంది



పెద్ద గురువులూరు వద్ద వంతెన నిర్మాణానికి భూములు కోల్పోయి 13ఏళ్లవుతోంది. వంతెన నిర్మాణ సమయంలో రైతులకు ఉపయోగకరంగా ఉం టుందని ప్రభుత్వం అడగ్గానే భూములు ఇచ్చాం. వం తెన నిర్మించి రోడ్డుకు భూములు కోల్పోయిన రైతు లకు నష్టపరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. దీనివల్ల తాము ఆర్థికంగా ఇబ్బందిపడుతునాం.

- పి.ఎల్లారెడ్డి, రైతు, పెద్దగురువలూరు

ముమ్మరం.. నీటి ట్యాంకు నిర్మాణం

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక అగ్రహారంలో తాగునీటి అవసరాల కోసం నిర్మించిన ట్యాంకు శిథిలమై ప్రమాదకర స్థితిలో ఉండేది. దాదాపు 35 ఏళ్ల క్రితం ట్యాంకు నిర్మించారు. ట్యాంక్ శిథిలం కావడంతో ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానిక ప్రజలు భయాందోళన చెందుతుండేవారు. ఈ సమస్యపై 'ప్రజాశక్తి'లో కథనాలు ప్రచురించారు. ఎట్టకేలకు ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. కొత్త ట్యాంక్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అగ్రహారంలోని అంగన్వాడీ కేంద్రం సమీపంలో దాదాపు రూ.39 లక్షల వ్యయంతో నూతనంగా ట్యాంక్ నిర్మాణ పనులు చేపట్టారు. అగ్రహారం గ్రామానికి కొత్త ట్యాంక్ ఏర్పాటుకు స్థానిక నాయకులు గంగాధర్ రెడ్డి, తాగునీటి సరఫరా విభాగం ఇంజినీర్ ఉమామహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ట్యాంక్ మంజూరుకు కృషి చేశారు. కొత్త ట్యాంక్ ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


నిర్మాణంలో ఉన్న అగ్రహారం నీటి ట్యాంక్


నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఫర్వీన్‌తాజ్

నారా లోకేష్‌ను కలిసిన ఫర్వీన్‌తాజ్

ప్రజాశక్తి- బి.కొత్తకోట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్ ఎన్టీఆర్ భవన్ నందు జరిగిన ముస్లిం మైనారిటీ ముఖ్య నాయకుల సమావేశం జరిగిందని చెప్పారు. సమావేశం అనంతరం రాష్ట్ర మైనారిటీ ముస్లిం ముఖ్య నాయకులతో కలసి చంద్రబాబునాయుడు నివాసానికి వెళ్లి నారాలోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలసినట్లు పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీ నాయకులు వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని, క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించి టిడిపి విధివిధానాలను వివరించాలని సూచించారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం తాను చేస్తున్న కార్యక్రమాలను లోకేష్‌కు వివరించినట్లు చెప్పారు.


వెంకటరమణను సత్కరిస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు

గంగనపల్లి వెంకటరమణకు సత్కారం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో పాల్గొని వచ్చిన తెలుగు పండితులు, తెలుగు భాషా సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణను సరస్వతీ విద్యా మందిరంలో రాజంపేట మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు కండువా, జ్ఞాపికతో ఆదివారం ఘనంగా సత్కరించారు. స్వభాషను రక్షించుకుందాం..స్వాభిమానాన్ని పెంచుకుందాం..అనే నినాదంతో జరిగిన ఈ మహాసభలలో రాజంపేట నుండి గంగనపల్లి పాల్గొనడం సంతోషించదగ్గ విషయమని సంస్థ సభ్యులు కొనియాడారు. తెలుగు భాషా విషయంలో గంగనపల్లి వెంకటరమణ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు నందకిషోర్ గౌడ్, కార్యదర్శి యూపీ రాయుడు, సంస్థ ప్రతినిధులు పతకమూరి వెంకటరమణ, పిసి నరసింహమూర్తి, శ్రీనివాసుల నాయుడు, విశ్రాంత తహశీల్దార్ ఓ.రామచంద్రయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ స్వామి, ఎన్.శివరాజు, పోకల ప్రభాకర్, రామచంద్రయ్య నాయుడు, నీలి రవీంద్ర, చీనేపల్లి చంగయ్య, చంద్రశేఖర్ రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

చిన్నారులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్ కొండూరు విజయ్ కుమార్‌రాజు తల్లి ధనలక్ష్మమ్మ జ్ఞాపకార్థం ఆదివారం బాలసదన్‌లో ఉన్న చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు వై.సుబ్రహ్మణ్యం రాజు మాట్లాడుతూ పేద విద్యార్థులకు సహాయం చేయడం అభినందనీయమని అన్నారు.లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరంతర సేవాకార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ పోతుగుంట రామేష్ నాయుడు, డాక్టర్ బాలరాజు, కె.విజయ్ కుమార్ రాజు, నాసర్, రామచంద్ర రాజు, వెంకట సుబ్బయ్య, కోశాధికారి నరసింహ రాజు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

నీలకంరావుపేట కల్పనాయిని చెరువు రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నూలివీడు రెడ్డయ్య అనే వ్యక్తికి తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. మండలంలోని సరస్వతి పల్లె దళితవాడకు చెందిన నూలివీడు రెడ్డయ్య నీలకంరావుపేట సమీపంలోని కంకరమిషన్‌లో పనిచేసుకుంటూ జీవన సాగించేవాడు. రోజు మాదిరిగానే పనికి వెళ్లి తిరిగిఇంటికి రావడానికి సిద్ధమవుగా తన మోటర్ బైక్ లో పెట్రోల్ అయిపోవడంతో వేరే వారి బండి తీసుకొని సమీపంలో పెట్రోల్ బంకులో పెట్రోల్ తీసుకొని తిరిగి కంకర మిషన్ దగ్గరకు వెళుతుండగా ఈద్గా సమీపంలో క్రాస్ వద్ద టిప్పర్ ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. గాయపడిన వ్యక్తిని స్థానికులు 108 సాయంతో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

మహిళపై దాడి : కేసు నమోదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


దాడిలో గాయపడ్డ రత్నమ్మ

తంబళ్లపల్లి మండలం కోటకొండ గ్రామ పంచాయతీ నాయని వారి పల్లిలో రత్నమ్మ తమ ఇంటి ముందు పశువులు వర్షంలో తడవకుండా ఉండేందుకు రేకులు వేస్తుంటే ఆ స్థలం వద్ద వివాదం చోటు చేసు కొంది. ఆస్థలం తమదేనంటూ రత్న మ్మ పై 8 మంది దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన పై బాధిత మహిళ మండలం పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. ఈ సంఘటనపై బాధితురాలు మాట్లా డుతూ గత ఏడాది క్రితం కూడా ఇదే సమస్య ఎదురు కాగా పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశామని గుర్తు చేశారు. ఎస్ఐ వివాదాస్పద స్థలాన్ని సర్వేయిర్ ద్వారా కొలతలు వేయించుకొని ఎవరిదైతే వారు తీకోవాలని సూచిస్తూ 10 రోజులు గడువు ఇచ్చారన్ని తెలిపారు. అప్పటినుండి ఇప్పటి వరకు స్పందిం చక పోగ, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆవులు తడవకుండా ఉండటానికి రేకులు వేసుకొంటుంటే తనపై దౌర్జన్యం చేస్తూ, పైపులు తొలగించి, ఉద్దేశ పూర్వకంగా దాడికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వివాదాస్పద స్థలాన్ని అధికారుల ద్వారా కొలతలు వేస్తే, తమది కాకుంటే షెడ్డుతో సహా వదిలేస్తామని పేర్కొన్నారు. తాము ఆస్థలాన్ని గత 30 సంవత్సరాలనుండి అనుభవిస్తున్నామని చెప్పారు. తనపై బి.ఈశ్వరయ్య బి.మల్లయ్య, నాగరాజా, బి. నాగరత్న, బి. సాంబ, బి.మనోహర, బి.రెడ్డమ్మ లు కలసి తమపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై పోలీసులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 26 డిసెంబర్ 2022
5
వైఎస్ఆర్





కడప : మరియాపురం చర్చిలో క్రిస్మస్ సందేశమిస్తున్న బిషప్ గాలిబాలి

సృజనాత్మక సాహిత్యాన్ని అందించడమే లక్ష్యం

కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత వేంపల్లి షరీఫ్



ప్రజాశక్తి-కడప ప్రతినిధి

యువ కవుల సృజనాత్మక రచనలు ఆస్వాదించాలనే ఉద్దేశంతో రాయలసీమ కార్యశాల లక్ష్యం. రాయలసీమకు ఎంతో సాహిత్య, సాంస్కృతిక చరిత్ర, వారసత్వం ఉంది. ముఖ్యంగా కడపజిల్లా తెలుగు కథకు పుట్టిల్లు. రాయలసీమ తొలి కథగా చెబుతున్న "మతభేదం" రాసింది కూడా జిల్లా వాసి అయిన అయ్యగారి నరసింహమూర్తి. ఇంత చరిత్ర ఉన్న జిల్లాలో శని, ఆదివారాల్లో రెండు రోజులపాటు భావి కథకుల కోసం "రాయలసీమ కథాకార్యశాల"ను ఏర్పాటు చేయడమైంది. ఇటువంటి ప్రక్రియల ద్వారా సీమ సాహిత్యాన్ని పరిపుష్టం చేయాలనే తలంపుతో ముందు కెళ్తున్న నేపథ్యంపై కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, యువ కథా రచయిత వేంపల్లె షరీఫ్‌తో ప్రజాశక్తి ముఖాముఖి

కథా కార్యశాలకు ప్రేరణ ఏంటి?

సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో రాణిస్తున్న యువత తక్కువగా ఉండటమే ప్రేరణ. కథలు రాయాలనే ఆసక్తి ఉన్నప్పటికీ కొంతమంది తగిన గైడెన్స్ లేక ఇబ్బంది పడుతున్నారని అనిపించింది. అందుకే దీన్ని ఏర్పాటు చేశాం. దీనివల్ల ఎంతో కొంత ఉపయోగం ఉంటుందని భావిస్తున్నా

కథా కార్యశాలకు స్పందన ఎలా ఉంది?

. చాలా బావుంది. రూ.600 రిజిస్ట్రేషన్ ఫీజు ఉన్నప్పటికీ ఎంతో మంది ఆసక్తి చూపించి వచ్చారు. పూర్తిగా రెండు రోజులపాటు ఇక్కడే ఉండి రాయలసీమ లబ్ధ ప్రతిష్ఠ రచయితల మధ్య గడిపారు. వారితో చర్చించి తాము తెలుసుకోవాల్సిందేదో తెలుసుకుని వెళ్లారు. నిజానికి రాయలసీమ వ్యాప్తంగానే దీన్ని జరపాలనుకున్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చాలామంది ఆసక్తి చూపడంతో అందరినీ చేర్చుకోవాల్సి వచ్చింది.

మళ్లీ ఇలాంటి కథా కార్యశాల ఎప్పుడు ఉంటుంది?

కథా కార్యశాల నిర్వహణ శ్రమ, ఖర్చుతో కూడుకున్నది. స్థానికంగా ఉన్న కథాపెద్దలు కేతు విశ్వనాథ రెడ్డి, షేక్ హుస్సేన్ సత్యాగ్ని, పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డితో పాటు ఈతరం కథకులు కొంతమంది సహకరించారు. అంతేకాదు అనంతపురానికి చెందిన కవిసమ్మేళనం సాహిత్య వేదిక బాధ్యులు, కవి కొత్త పల్లి సురేశ్ సహకారం కూడా మరువలేనిది. రాయలసీమ వ్యాప్తంగా ఉన్న కథాపెద్దలంతా ఈ ప్రయత్నం వెనుక ఉన్నారు. మళ్లీ అలాంటి వాతావరణం వస్తే తప్పకుండా త్వరలోనే మరోచోట కథాకార్యశాల జరుపుతాం.

మీరు ఈ మధ్య 40 ఏళ్ల లోపు కథకులతో "యువ' అనే పుస్తకాన్ని తీసుకొచ్చారు? దాని గురించి చెప్పండి?

రెండు రాష్ట్రాల్లో కథలు రాస్తున్న 40 ఏళ్లలోపు యువకులు దాదాపు 120 మంది దాక ఉన్నారు. వారిలో బాగా రాస్తున్న వారి కథలను తీసుకుని ఈ పుస్తకం తెచ్చాను. దీనివల్ల రేపటి తరం ఏం రాస్తున్నారు? ఎలా రాస్తున్నారు? వంటి పరిశీలనలు చేయడానికి పరిశోధన విద్యార్థులకు అవకాశం దొరుకుతుంది.

మరి మీ పరిశీలనలో తెలుగు కథ భవిష్యత్తు ఎలా ఉంది?

భేషుగ్గా ఉంది.

మీ తర్వాత ప్రాజెక్టు ఏంటి?

ఏమీ అనుకోలేదు. కథలు రాయడం మీదే దృష్టి పెడతాను. అంతే.

మీరింత వరకు పొందిన పురస్కారాల గురించి చెబుతారా?

చెప్పను. ఎందుకంటే నాకొచ్చిన పురస్కారాల గురించి నేనే చెప్పుకోవడం సబబుగా ఉండదేమో

క్రిస్మస్ వేడుకల్లో సిఎం జగన్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మూడు రోజుల జిల్లా పర్యటనలో ఆదివారం పులివెందులలోని సిఎస్ఐ చర్చిలో తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థన కూటమిలో జగన్ పాల్గొన్నారు. అనంతరం సిఎస్ఐ చర్చిలో తల్లి విజయమ్మతో కలిసి క్రిస్మస్ కేకు కట్ చేశారు. జగన్‌కు తల్లి విజయమ్మ కేక్‌ను తినిపించారు. సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ప్రార్థనా కూటములు ముగిసిన అనంతరం చర్చిలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ పండుగ వేడుకలో పాల్గొన్న జగన్ బంధువులు, స్నేహితులు, ఆప్తులు, అభిమానులకు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ రోజున ప్రతి ఏడాది తన సొంత గడ్డపై ఇదే చర్చిలో కుటుంబ సభ్యులు, బంధుగణం, స్నేహితులతో కలిసి పండుగ వేడుకలో పాల్గొనడం తన మనసుకు ఎంతో ఆనందాన్నిచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జగన్ సతీమణి వైఎస్. భారతి, తల్లి విజయమ్మ, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్. భాస్కర్‌రెడ్డి, వైఎస్.ప్రకాశ్‌రెడ్డి, భారతమ్మ, సత్యవతమ్మ, మాధవీలత, ఉప ముఖ్య మంత్రి ఎస్.బి. అంజాద్ బాషా, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి,కలెక్టర్ వి.విజయ్ రామరాజు, ఎస్పి అన్బురాజన్, ఏఎస్పీ తుషార్ డూడీ, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పాల్గొన్నారు. సిఎస్ఐ చర్చిలో ప్రార్థనా కూటములు ముగించుకొని భాకారపురం హెలిప్యాడ్ నుంచి కడపకు చేరుకుని ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్లారు.



సిఎస్ఐ చర్చిలో కుటుంబ సభ్యులతో కలసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న సిఎం జగన్



తల్లి విజయమ్మకు కేక్ తినిపిస్తున్న సిఎం జగన్

పింఛన్ల తొలగింపుపై 27న ఆందోళన

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలో సామాజిక పెన్షన్లను లబ్ధిదారుల సంఖ్యను కుదింపు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 27న ఉదయం 10 గంటలకు కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేయనున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి ఎ రామమోహన్ తెలిపారు. ఆదివారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2023, జనవరి 1 నుంచి పెన్షన్ మొత్తాన్ని రూ.2500 నుంచి రూ. 2750 వరకు పెంచడాన్ని తమ పార్టీ హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. కానీ పెంచిన మొత్తాన్ని గతంలో ఉన్న లబ్ధిదారులందరికీ వర్తింప చేయకుండా లబ్ధిదారుల సంఖ్యను కుదించే ప్రయత్నం సమంజసం కాదన్నారు. పెన్షన్ పొందుతున్న వారిలో వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, ఇతర కేటగిరీలకు చెందిన వారు ఉన్నారని వారందరూ ఉన్నారని చెప్పారు. ఇలాంటి సామాన్య ప్రజల పెన్షన్ ఆగిపోవడం వల్ల ఆర్థికంగా తీవ్ర కష్టాలు పడే ప్రమాదం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల సంఖ్యను కుదించాలనే ప్రయత్నాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా చితికిపోయి ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ మీదనే ఆధారపడి జీవిస్తున్న ప్రజల బాధలు ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. లబ్ధిదారుల సంఖ్యను కుదించాలనే ప్రయత్నాలు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మానుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలో ప్రతి వార్డులో 60 నుంచి 100 దాకా పెన్షన్లలో కోత కోశారని, దీనివల్ల ప్రజల ఆర్థిక పరిస్థితుల మీద తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్క పెన్షన్ను తొలగించిన సిపిఎం చూస్తూ ఊరుకోదని, పోరాటం చేస్తుందని హెచ్చరించారు. అందులో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట జరిగే ఆందోళనలో ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పోరాటం కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళనతో ఆగదని జనవరిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించి ప్రజానీకాన్ని కూడగట్టే ప్రయత్నం చేస్తామని తెలిపారు. నగర ప్రజానీకం పెన్షన్ల తొలగింపుకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో నగర కార్యదర్శి వర్గసభ్యులు చంద్రారెడ్డి, కమిటీ సభ్యులు ఓబులేసు, ఎమ్మార్ నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామ మోహన్

సంస్కృతాంధ్ర విద్వత్కవితిలకుడు వేంకట రమణయ్య

ప్రజాశక్తి కడప అర్బన్

సంస్కృతం, తెలుగు భాషల్లో విశిష్టమైన రచనలు చేసిన విద్వత్కవితిలకుడు బండ్ల వేంకట రమణయ్య అని విశ్రాంత తెలుగు పండితులు ఎ.సి.దస్తగిరి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 115వ సదస్సు నిర్వహించారు. 'బండ్ల వేంకట రమణయ్య జీవితం - సాహిత్యం' అనే అంశంపై విశ్రాంత తెలుగు పండితులు ప్రసంగించారు. బండ్ల వేంకట రమణయ్య నెల్లూరు జిల్లాలోని బండ్లపాళెంలో జన్మించారని, విద్యాభ్యాసమంతా నెల్లూరులోనే జరిగిందని తెలిపారు. నెల్లూరులోని వేద సంస్కృత కళాశాలలో 12 ఏళ్ళు చదివి వ్యాకరణ విద్యాప్రవీణ, భాషాప్రవీణ అనే పట్టాలను, ఆ తర్వాత ప్రయివేట్‌గా బిఎ, ఎంఎ పట్టాలను పొందారని తెలిఆపరు. తెలుగు ఉపాధ్యాయులుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి నెల్లూరులోని క్రిష్టియన్ పాఠశాలలో ఒక సంవత్సరం పనిచేశారని చెప్పారు. 976లో ఆయనతో తనకు పరిచయం ఏర్పడిందని చెప్పారు. ఆయన తనకు కవితా గురుడని, కవితా రచనకు అవసరమైన మెళకువలెన్నో ఆయన దగ్గర నేర్చుకున్నానన్నారు. వేంకట రమణయ్య శ్రీమదాంధ్ర మధురా విజయం, మంజీర విలాసం, వేమభూపాల చరితం అనే మహాకావ్యాలను రచించారని చెప్పారు. కార్యక్రమ ప్రారంభంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకట రమణ కలసి వక్త ఎ.సి.దస్తగిరిని ఘనంగా సత్కరించారు.



విశ్రాంత తెలుగు పండితుడిని సన్మానిస్తున్న కవులు, రచయితలు

రైతు బాంధవుడు బిజివేముల వీరారెడ్డి

మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

ప్రజాశక్తి - బద్వేలు

విద్యాప్రధాత, రైతు బాంధవుడు, బద్వేలు ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం తపనపడిన ఏకైక నాయకులు, మాజీ మంత్రి కీర్తిశేషులు బిజివేముల వీరారెడ్డి అని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పేర్కొన్నారు. ఆదివారం ఆయన 22వ వర్ధంతి సందర్భంగా ఎస్‌బివిఆర్ కళాశాల ప్రాంగణంలోని ఆయన ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించి, అనంతరం పట్టణంలోని నాలుగు రోడ్ల సెంటర్ లోని ఆయన కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కడప పార్లమెంటు టిడిపి అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి, ఎపిఎస్ ఆర్‌టిసి మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, టిడిపి యువ నాయకులు రితేష్‌రెడ్డితో కలసి ఆమె విలేకర్లతో మాట్లాడుతూ నియో జకవర్గ అభివృద్ధి కోసం బిజవేముల వీరారెడ్డి ఆశీస్సులతో తమ కుటుంబం ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. బద్వేలు ప్రాంత రైతుల సంక్షేమం కోసం అప్పట్లో తన తండ్రి వీరారెడ్డి ప్రభుత్వంతో మాట్లాడి తెలుగుగంగ ప్రాజెక్టు నిర్మాణానికి ఎంతో కృషి చేశారని చెప్పారు. వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. పేద ప్రజలకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి , మాజీ ఎమ్మెల్సీలు పుత్తా నరసింహారెడ్డి, బత్యాల చెంగల్‌రాయుడు, జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్ రెడ్డి, పట్టభద్రుల టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, నియోజకవర్గంలోని అన్ని మండల పార్టీ అధ్యక్షులు, ఖాజీపేట మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, టిడిపి నాయకులు పిచ్చి నాయుడు, గోవింద సుబ్బయ్య, హరినాథ్ రెడ్డి, మామిళ్ల కృష్ణారెడ్డి, సంజీవ రాయుడు, రమేష్ నాయుడు, బండి చిన్న పాల్గొన్నారు.



వీరారెడ్డి విగ్రహానికి నివాళర్పించి ప్రజలకు అభివాదం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నాయకుడు రితేష్‌రెడ్డి

తొగట వీర క్షత్రియ సంఘాన్ని బలోపేతం చేద్దాం

- రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్

ప్రజాశక్తి - సుండుపల్లి

తొగట వీర క్షత్రియ సంఘాన్ని అందరం ఐక్యంగా బలోపేతం చేద్దామని తొగట వీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్ అన్నారు. ఆదివారం రాయచోటి సంఘం కార్యాలయంలో సుండుపల్లి మండల నూతన కమిటీని నియమించారు. కమిటీ అధ్యక్షులుగా బొమ్మిశెట్టి రెడ్డప్ప, ఉపాధ్యక్షులుగా రెబ్బా తిరుమయ్య, బోజనపు సురేంద్ర, ముదిసెట్టి దనసేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పెద్దకోట్ల వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా గుదిటి రవి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు బోజనపు వెంకట నారాయణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మోడెం వీరాంజనేయ ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు సంఘం బలోపేతానికి తమ పరిధిలో శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఎప్పుడూ తమ సహాయ సహకారాలు ఉంటామని పేర్కొన్నారు. కులస్థుల సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళ అధ్యక్షులు సురువు శ్రీలత, రాష్ట్ర చేనేత సంక్షేమ అధ్యక్షులు కుర్రా వెంకట రమణ, రాయలసీమ అధ్యక్షులు బొమ్మల వెంకట రత్నం, జిల్లా అధ్యక్షులు బోజనపు వెంకట నారాయణ, ఉపాధ్యక్షులు రామిశెట్టి రత్నమయ్య, సలహాదారు సహదేవయ్య, ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిట్టెం రామచంద్ర, అనంతపురం జిల్లా అధ్యక్షులు బండి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి చింతా కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు సాయి ప్రసాద్, తిరుపతి జిల్లా అధ్యక్షులు మందపల్లి బాబు, ప్రధాకార్యదర్శి చిన్న రెడ్డి, కోశాధికారి వెంకట రత్నం, చిత్తూరు జిల్లా అధ్యక్షులు పురం మల్లయ్య, ప్రకాశం జిల్లా రాష్ట్ర సభ్యులు పల్లా మాలకొండ రావు, రాయచోటి వైసిపి బిసి ప్రధాన కార్యదర్శి సిబ్యాల విజయ భాస్కర్, లక్కిరెడ్డిపల్లి టివికె అధ్యక్షులు దండే శ్రీనివాసులు, రామాపురం అధ్యక్షులు బొమ్మి సెట్టి వెంకటరమణ, గాలివీడు మండల టివికె అధ్యక్షులు మోడెమ్ చెంద్రాయుడు, వీరబల్లి మండల ఉప ఎంపిపి మోడెమ్ నాగభూషణం, మండల ఉపాధ్యక్షుడు వేల్పుల ఆంజనేయులు, మందపల్లి వెంకట సుబ్బరాయుడు, మోడెం మల్లికార్జున, చౌడయ్య, వెంకటేష్, సుండుపల్లి మండల కార్యవర్గ సభ్యులు గుదిటి రెడ్డయ్య, గాలి నాగయ్య, బోల్లు చంద్రశేఖర్, రాయని ప్రసాద్, బొమ్మిసెట్టి ఆంజనేయులు, బండి నారాయణ, మందపల్లి రెడ్డయ్య, గౌరవ సలహాదారులు, మాజీ ప్రెసిడెంట్ గుండ్లపల్లి రామచంద్ర, మందపల్లి వెంకటేష్ ,పురం రెడ్డి లక్ష్మి నారాయణ, రిబ్బా శివయ్య పాల్గొన్నారు.



వీరాంజనేయ ప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మెల్సీగా దూదేకులకు అవకాశం కల్పించాలి

లోకేష్‌కు మన్నూరు అక్బర్ వినతి

ప్రజాశక్తి -కడప అర్బన్

దూదేకులు టిడిపికి ఓటు బ్యాంకుగా ఉన్నారని, వారికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి, దూదేకుల హక్కుల పోరాటం సమితి రాష్ట్ర అధ్యక్షులు మన్నూర్‌అక్బర్ కోరారు. ఆదివారం టిడిపి రాష్ట్ర కార్యాలయంలో లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మన్నూర్ అక్బర్ మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులకు చట్టపరంగా న్యాయం, రైతులకు, ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యం, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి తరహాలో విద్య అందేలా కృషి చేయాలని కోరారు. ముస్లిముల నాయకత్వం పెంపొందేలా వారి ద్వారా తమ తమ వర్గాలకు సేవ చేసే విధంగా ముందుకు పోవాలని విజ్ఞప్తి చేశారు. పనిచేసే వారికి పార్టీ అండగా ఉండి సరియైనా సమయంలో న్యాయం చేస్తుందని, ప్రజలకు అండగా ఉంటూ అందరమూ కలిసి పోరాడాలని లోకేష్ తెలిపారు.



లోకేష్ కు వినతిపత్రం అందజేస్తున్న మన్నూర్ అక్బర్

ఎస్‌టియు కృషి ఎనలేనిది

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని ప్రవాస భారతీయుడు, దుబాయ్ ప్రభుత్వ ఉద్యోగి నూకల మురళీకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఎస్‌టియు భవనాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌టియు చేస్తున్న ఉపాధ్యాయ, విద్యారంగ, సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి, పరిష్కరింపచేయడంలో ఆ సంఘ నాయకుల కృషి ఎనలేనిదన్నారు. ఎస్‌టియు భవన నిర్మాణానికి తనవంతుగా రూ. 2.5లక్షల విరాళాన్ని అందజేస్తున్నానన్నారు. ఎస్టీయు జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి మాట్లాడుతూ భవనం జనవరి 8న ప్రారంభించనున్నామని చెప్పారు. భవిష్యత్తులో కార్యాలయం ద్వారా సామాజిక పరమైన సేవా కార్యక్రమాలు కూడా చేపట్టే ఆలోచన చేస్తున్నామన్నారు. అనంతరం మురళీకృష్ణను ఎస్టీయు నాయకులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయు రాష్ట్ర నాయకులు బాలరాజు, చంద్రశేఖర్, జిల్లానాయకులు పుల్లయ్య, విజయభాస్కర్, కుళ్లాయప్ప, వెంకటరామయ్య, మండల నాయకులు వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, రఘురామిరెడ్డి, సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు నటరాజ్, బాలఅంకిరెడ్డి పాల్గొన్నారు.

బంజారాలు ఐక్యంగా ముందుకెళ్లాలి

కడప అర్బన్ : బంజారాలు ఐక్యంగా ముందుకు నడవాలని విశ్రాంత అడిషనల్ డిజిపి డాక్టర్ డి.టి. నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం వైఎస్ఆర్ ఆడిటోరియంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆంధ్రప్రదేశ్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయనతోపాటు ఎస్. చిన్న రాముడు, జాతీయ నాయకులు హరిలాల్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తండాలలో అవగాహన కల్పించి బంజారాలు బాగా చదువుకుని రాజకీయంగా ఆర్థికంగా ఎదిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. చదువు కుని మంచి ఉద్యోగాలలో ఉన్నవారు తండాలు తిరిగి చదువుకోని వారికి సహకారం అందించాలని కోరారు. ఇటీవల ఇతర అభివృద్ధి చెందిన కులాలు గిరిజనులలో చేరాలని చూస్తున్నారని, అటువంటి వాటికి అవకాశం ఇవ్వకుండా అందరు ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ నుంచి నూతన సభ్యులను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా నంద్యాల జిల్లాకు చెందిన ఎస్. వెంకట రమణ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అనంతపురానికి చెందిన ఎం. చక్రి నాయక్, రాష్ట్ర కోశాధికారిగా కడప జిల్లాకు చెందిన డాక్టర్. ఐ. శివా నాయక్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏం. వెంకట స్వామి నాయక్, గౌరవ అధ్యక్షులు ఏం. శంకర్ నాయక్, జగన్ నాయక్, అర్జున్ నాయక్, వెంకట్ నాయక్, రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్. లక్ష్మ నాయక్, ఒంగోలు డాక్టర్.బాలాజీ నాయక్, అనంతపురం రాగూర్ నాయక్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూతన సంవత్సరానికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-పీలేరు

నూతన సంవత్సరం సందర్భంగా తీర్థయాత్రలు, విహారయాత్రలు చేయాలనుకునే వారి కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పీలేరు ఆర్టీసీ డిపో మేనేజర్ బండ్ల కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2023 జనవరి 1న తీర్థయాత్రకు వెళ్లాలనుకునే భక్తుల కోసం ఉదయం 6.30 గంటలకు కల్లూరు మీరుగా సదుం యల్రాతివారిపల్లెలోని అయ్యప్పస్వామి, తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయాల దర్శనానికి, అలాగే హార్సిలీ హిల్స్ విహారయాత్ర చేయదలచిన వారి కోసం అదేరోజు ఉదయం 7 గంటలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగన్ పాలనలో నాడు ముద్దులు.. నేడు గుద్దులు

రాయచోటి : ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలనపై పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి మండిపడ్డారు. 'జగన్ పాలనలో నాడు ముద్దులు..నేడు గుద్దులు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు అవ్వ తాతల తలరాతలు మారుస్తానని చెప్పి ఇప్పుడు వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఆదివారం పట్టణంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్.అల్లబకాష్‌తో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే రూ.3 వేలు పింఛన్ ఇస్తానని చెప్పడంతో అవ్వతాతల నమ్మి ఓట్లు వేసి గెలిపించాకా, అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కావస్తున్నా రూ.2500 ఇస్తున్నారున్నారు. అంతటితో ఆగకుండా రకరకాల షరతలతో 4 లక్షల మందిని వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు తీసేసారన్నారు. ఇంటికి ఒక మహిళకు పింఛను సౌకర్యం అనే నినాదంతో అనేక కుటుంబాలలో చిచ్చు పెడుతున్నారున్నారు. ఒక ఇంటిలో అత్త వయస్సు 70 ఏళ్ళు, కోడలు వితంతువు ఉంటారని, వారి మధ్య చిచ్చులు పెడుతున్నారుని విమర్శించారు.

ఎమ్మెల్యేను సన్మానించిన కార్మికులు

చెన్నూరు : చక్కెర ఫ్యాక్టరీ కార్మికుల కష్టాలలో ముందుండి వారికి మనో ధైర్యాన్ని కల్పించి, వారి కుటుంబాలకు అండదండలుగా నిలబడి కృషి చేసిన కమలాపురం శాసనసభ్యులు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డిని షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు ఆదివారం శాలువా కప్పి, పుష్పగుచ్ఛ అందజేసి ఘనంగా సన్మానించారు, అనంతరం ఒకరికి ఒకరు స్వీట్లు తినిపించుకుంటూ, సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు పి. కృష్ణ ,పెంచల్ రెడ్డి నబి రసూల్ వెంకటరెడ్డి మాట్లాడుతూ చెన్నూరు షుగర్ ఫ్యాక్టరీ మూతపడి చాలా సంవత్సరాలు అయినప్పటికీ ప్రభుత్వాలు కార్మికుల కష్టాలు పట్టించుకున్న పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో తమ కష్టాలను చూసి చెల్లించిపోయారన్నారు. తమ కష్టాలను ఎప్పటికప్పుడూ ముఖ్యమంత్రి దృష్టికి కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తీసుకెళ్లారన్నారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు, అనంతరం వారు స్థానిక నాయకులు, మండల కన్వీనర్ జి ఎన్, భాస్కర్ రెడ్డి, ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్, వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌విఎస్ఆర్, కనపర్తి ఎంపిటిసి పెను మారు రఘురామిరెడ్డి సహాయ సహకారాలతో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న చక్కెర కర్మాగార పరిశ్రమ కార్మికులు

నాయీ బ్రాహ్మణులకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి

ప్రజాశక్తి - వేంపల్లె

నాయీ బ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రవేశ పెట్టాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గూడూరు రామచంద్రా ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి పథకాలు ప్రవేశపెట్టాలన్నారు. ఏపీ నాయీ బ్రాహ్మణ సంఘం తన సేవలను గుర్తించి మళ్లీ జిల్లా అధ్యక్ష బాధ్యతలను ఇచ్చినందుకు రాష్ట్ర సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. అభద్రత భావంతో నాయీ బ్రాహ్మణులు ఉన్నట్లు చెప్పారు. నాయీ బ్రాహ్మణ సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వం కూడా నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి తోడ్పడు ఇవ్వాలని కోరారు.

శిల్పారామంలో సందడే సందడి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని శిల్పారామంలో క్రిస్మస్ పండగ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన పలు జానపద, సంస్కృతి నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శిల్పారామ పరిపాలన అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో విజయవాడ ఎక్సలెంట్ ఇన్స్టిట్యూట్, నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్, పులివెందుల చిన్నరంగే శ్రీలక్ష్మి డ్యాన్స్ మాస్టర్ సమక్షంలో చేసిన శాస్త్రీయ, జానపద, మొదలగు నృత్య ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. పండగ సందర్భంగా భారీ ఎత్తున ప్రజలు శిల్పారామం కు రావడంతో ఆ ప్రాంగణం అంతా సందడి నెలకొంది.



నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

విఎఎ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక ఎన్జీఒ భవనంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ రామ్ చరణ్ అధ్యక్షతన కడప జిల్లా గ్రామ వ్యవసాయ సహాయకుల నూతన కార్యవర్గం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జి. హరింద్ర ప్రధాన కార్యదర్శిగా సి. బ్రహ్మ నందరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎం. గోపిరాం, ట్రెజరర్‌గా ఎ. అఖిలాష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా యస్. గిరిధర్ రెడ్డి, ఎస్. సమరసింహారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా సి.మాధవ్‌రెడ్డి జి. వెంకటేష్ రాజు, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎన్. నవీన్ ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా యు. సునీల్, పవన్, వంశీ, హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పవన్, గాలికుమార్, శ్రీకాంత్, సాయి తేజ, జగదీష్, సుధాకర్, ఆంజనేయులు నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజులలో రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు.



చాపాడు వద్ద దోస పంట సాగుకు చేస్తున్న దుక్కిళ్లు

ఆరుతడి పంటల దుక్కిళ్లు ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరి పంట నూర్పిడి పనులు పూర్తవడంతో రైతులు ఆరుతడి పంటల సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా దుక్కిళ్లు ప్రారంభించారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 14వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. ఇప్పటివరకు 6 వేల ఎకరాల్లో వరి పంట నూర్పిడి పనులు పూర్తయ్యాయి. మిగిలిన నూర్పిడి దశలో ఉంది. రామాపురం, అయ్యవారిపల్లి, తిమ్మయ్యపల్లి గ్రామాల పరిధిలో కొంతమంది రైతులు రెండవపంటగా వరి పంటసాగు చేపడుతున్నారు. సీతారామపురం, చాపాడు, చియ్యపాడు, రాజువారిపేట, వెదురూరు గ్రామాల పరిధిలో ఆరుతడి పంటల సాగుకు దుక్కిళ్లు చేపడుతున్నారు. దోస, నూగు, కూరగాయల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. గతంలో దోస పంటను రైతులు అధికంగా సాగు చేపట్టేవారు. ఈ ఏడాది నూగు, కూరగాయల పంట సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఎకరా దుక్కికు ట్రాక్టర్ కు రూ.14వందలు అద్దులు అవుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.



బండి జకరయ్యను పరామర్శిస్తున్న తులసిరెడ్డి, నీలిశ్రీనివాసరావు

బండి జకరయ్యకు పరామర్శ

కడప: ఇటీవల కాంగ్రెస్ నేత బండి జకరయ్య అనుకోకుండా కింద పడిపోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బెంగళూరులోని సెంట్ యాన్స్ హాస్పిటల్కు తీసుకువెళ్లారు. చికిత్స అనంతరం కడపకు వచ్చినటువంటి జకరయ్యను ఆదివారం కాంగ్రెస్ నేతలు డాక్టర్ ఎన్. తులసి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు లు, ప్రకాష్ నగర్ లోని జకరయ్య స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. జకరయ్య త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని అభిలషించారు. కార్యక్రమంలో నేతలు తులసి రెడ్డి, నీలి శ్రీనివాసరావు, తిరుమలేష్, శివ, రత్నం, ఉత్తన్న, అమర్ పాల్గొన్నారు.

'సృష్టిలో మానవత్వాన్ని మించిన మతంలేదు'

రాయచోటి: సృష్టిలో మానవత్వాన్ని మించిన మతం లేదని వైసిపి మైనార్టీ నాయకులు బేపారి మహమ్మద్ ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జూనియర్ కళాశాలలో రాయచోటి మానవతా వైద్యుల రెడ్డి ఆధ్వర్యంలో సెంచారి సమావేశం నిర్వహించారు. కళాశాల అధ్యక్షులు డాక్టర్ శివకరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి మహమ్మద్ ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మెన్ ఫాయాజుర్ రహమాన్, గున్నికుంట్ల, గురిగింజకుంట ఎంపిటిసి శ్రీధర్‌రెడ్డి, విశ్రాంత లెక్చరర్ రహంతుల్లా, రెడ్డిమున్నిస్సా హాజరయ్యారు. సంబేపల్లె మండలం గురిగింజకుంట పంచాయతీకి చెందిన ఆదర్శ రైతు రెడ్డయ్య మానవత సంస్థ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి రూ.5,016 నగదుతో పాటు మానవత మెమెంటోను అతిథులు అందజేశారు. అతిథులుగా హాజరైన వారిని మానవత కుటుంబ సభ్యులు శాలువాతో సన్మానించి మానవత మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా దాతల సహకారంతో వివిధ రకాల ఉచిత సేవలు అందజేయడం చాలా హర్షించదగ్గ విషయమన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా వివిధ రకాల ఉచిత సేవలు అందించడానికి బేపారి మహమ్మద్ ఖాన్ రూ.30 వేలు, ఎంపిటిసి శ్రీధర్‌రెడ్డి రూ.25 వేల నగదును మానవత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సంఘం భాస్కర్‌బాబు, మానవత జిల్లా డైరెక్టర్ బ్రహ్మానంద రెడ్డి, సెక్రటరీ వెంకట్రామరెడ్డి, గౌరవ సలహాదారుడు వెంకటసుబ్బారెడ్డి, కమిటీ సహదేవరెడ్డి, మాజీ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, మానవత సభ్యులు శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ ఎదురుచూపులు..!

పెద్దగురువలూరు, కుచ్చుపాప నిర్వాసితులకు అందని పరిహారం.. ప్రారంభానికి నోచని వంతెన

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని పెద్ద గురువలూరు-కుచ్చుపాప గ్రామాల మధ్య కుందూ నదిపై నిర్మించిన వంతెన ప్రారంభానికి నోచుకోలేదు. ఈ వంతెనకు సంబంధించి అనుసంధాన రోడ్డుకు భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం మంజూరు చేయకపోవడంతో రైతులు ఎదురు చూస్తున్నారు. 2010 వంతెన నిర్మాణాన్ని ప్రారంభించి 2014 నాటికి పూర్తి చేశారు. అయితే వంతెనకు ఇరువైపులా అనుసంధాన రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో ప్రారంభం కాలేదు. పెద్ద గురువులూరు, చిన్న గురువలూరు, శ్రీరాములపేట, అల్లాడుపల్లె, కుచ్చుపాప, నక్కలదిన్నె, రామసుబ్బమ్మ కొట్టాల వంటి గ్రామాల ప్రజలకు ఈ వంతెన ప్రారం భమైతే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం ఈ గ్రామాల ప్రజలు తాత్కాలికంగా ఈ రోడ్డు వెంబడి ప్రయాణిస్తున్నారు. అనుసంధాన రోడ్డు కోసం ఈ ప్రాంత రైతులు తమ పొలాలను ఇచ్చారు. నష్టపరిహారం మంజూరు చేయడంలో ప్రభుత్వం జాప్యం చేయడంతో పనులు నిలిచి పోయాయి. వంతెనకు ఇరువైపులా దారి కోసం 48 మంది రైతులు 4.72 ఎకరాల పొలాలను ఇచ్చారు. అప్పట్లో ఎకరా రూ.8 లక్షల వరకు విలువ ఉన్న భూములు ఇచ్చినప్పటికీ ఉప యోగం లేకుండా పోయిందని రైతులు వాపో తున్నారు. ప్రస్తుతం ఎకరా విలువ రూ.30 లక్షలు ధర పలుకుతోంది. బూడిదపాడుకు చెందిన 35 మంది రైతులు 3.80 ఎకరాలు, పెద్ద గురువలూరుకు చెందిన ఇద్దరు రైతులు 0.84 ఎకరాలు, కుచ్చుపాపకు చెందిన 11 మంది రైతులు 0.78 ఎకరాల భూములను రైతులు రోడ్డు నిర్మాణానికి వ్యవసాయ భూములను ఇచ్చారు. 2016 నవంబర్‌లో జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమానికి హాజరైన అప్పటి జెసి రామారావుకు బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. స్వయానా జెసి రైతులతో కలిసి వంతెన దారి కోసం ఇచ్చిన పొలాలను పరిశీలించి, పరిహారం ఇప్పించేందుకు ఏర్పాటు చేయాలని ఆర్‌డిఒకు ఆదేశాలు జారీ చేశారు. ఆ తర్వాత బదిలీపై వచ్చిన ప్రతి అధికారి దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ రైతులకు న్యాయం జరగలేదు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించి, రోడ్డు పనులను పూర్తిచేసి వంతెనను ప్రారంభిస్తే ఆయా గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.



ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉన్న వంతెన

రైతులకు న్యాయం చేయాలి



వంతెన నిర్మాణానికి సహకరించి, అనుసంధాన రోడ్డుకు భూములిచ్చి ఉపాధి కోల్పోయిన రైతు లకు ప్రభుత్వం ఇప్పటికైనా న్యాయం చేయాలి. భూములిచ్చి అన్ని విధాలా నష్ట పోయాం. ప్రస్తుతం భూములు మార్కెట్‌లో ఎకరా రూ.30 లక్షలుగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలి. రోడ్డు నిర్మాణానికి 0.64 ఎకరాలు భూమినిచ్చాను.

- సత్య వేమారెడ్డి, రైతు, పెద్దగురువలూరు

భూములు కోల్పోయి 13 ఏళ్లవుతోంది



పెద్ద గురువులూరు వద్ద వంతెన నిర్మాణానికి భూములు కోల్పోయి 13ఏళ్లవుతోంది. వంతెన నిర్మాణ సమయంలో రైతులకు ఉపయోగకరంగా ఉం టుం దని ప్రభుత్వం అడగ్గానే భూములు ఇచ్చాం. వం తెన నిర్మించి రోడ్డుకు భూములు కోల్పోయిన రైతు లకు నష్టపరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. దీనివల్ల తాము ఆర్థికంగా ఇబ్బందిపడుతునాం.

- పి.ఎల్లారెడ్డి, రైతు, పెద్దగురువలూరు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వేంపల్లె : అనాథ వృద్ధులకు అన్నదానం చేస్తున్న ఆప్ నాయకులు



జమ్మలమడుగు : టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- కడప అర్బన్

క్రీస్తు జయంతి క్రిస్మస్ పండుగ సందర్భంగా సెయింట్ మేరీస్ క్రేతిడల్ చర్చిలో (కడప మరియాపురం) అర్ధరాత్రి ప్రత్యేక దివ్యబలి పూజ నిర్వహించారు. కడప కతోలిక మేత్రసనం అపోస్తులిక పాలన అధికారి, బిషప్ గాలి బాలి ఆధ్వర్యంలో క్రిస్మస్ కేకు కట్ చేసి విశ్వాసులందరికీ పంచుతూ క్రీస్తు జయంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విచారణ గురువులు ఫాదర్ బిరుసు రాజా, సహాయ గురువు ఫాదర్ చంద్ర, ఫాదర్ రూపేష్, ఫాదర్ లూర్డ్ రాజు, సిస్టర్స్, విచారణ పెద్దలు పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** మండల వ్యాప్తంగా ఉన్న చర్చిలల్లో క్రిస్టియన్ సోదర సోదరిమనులు క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర క్రిస్టి యన్ (కన్వర్ట్) ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లోనూ, పార్టీ కార్యాలయంలోనూ, దేవగుడి గ్రామంలోనూ, దానవులపాడు గ్రామంలోనూ టిడిపి ఇన్‌ఛార్జి సి. భూపేష్‌రెడ్డి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జంబాపురం రమణారెడ్డి, పొన్నతోట శ్రీనివాసులు, జయచంద్ర, నెల్సన్ కుమార్, ఫిలిప్, రమేష్, పురుషోత్తం, చెన్నయ్య, కులాయప్ప, సోపాల్ రాజా, విల్సన్, రాజేష్, ప్రభాకర్, రాజు, మంటీ రాజు, గోపాల్, కిషోర్, సురేష్, వెంకట కృష్ణయ్య, స్థానిక సిఎస్ఐ, ఆర్‌సిఎం, టౌన్ చర్చిలలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ప్రార్థనలు చేశారు. **అనాథలకు దుస్తులు పంపిణీ** ..అగ్ని అభిషేక మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో అనా థలకు, వృద్ధులకూ, వితంతువులకు, మానసిక వికలాంగులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేసినట్లు ప్రెసిడెంట్ చంద్రమోహన్, సెక్రటరీ పాల్ సుధాకర్ అన్నారు. ఆదివారం రాజీవనగర్ చేనేత కాలనీ, గూడెంచెరువు లో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అగ్ని అభిషే మినిస్ట్రీస్ సభ్యులు జోసెఫ్ అనిల్, కిరణ్ కుమార్, వర్ధి షబాణ్య పాల్గొన్నారు. **ముద్దనూరు :** క్రిస్మస్ పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని క్రైస్తవులకు మండల నాయకులు డాక్టర్ మధుసూదన రెడ్డి ఆధ్వర్యంలో ఆయన కుమారుడు యువ నాయకులు గుణవంత్‌రెడ్డి క్రిస్మస్ కానుకలను అందజేశారు. మండలంలోని అన్ని చర్చిలలో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సిఎస్ఐ, సిఎస్ఐ (ఎస్పిజి), ఆర్‌సిఎం, మన్నా, హెబ్రోను, హోసన్నా, గుత్తి శాల, పెంతెకోస్తు ప్రార్థన మందిరాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సిఎస్ఐ చర్చిలో రెవరెండ్ పాస్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ పర్వదినం ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ సరళ, ఎంపిటిసి ఇంద్రాణి, సంఘ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. **చాపాడు :** మండల పరిధిలోని అన్ని గ్రామాలలోని చర్చిలలో ఆదివారం క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. మత పెద్దలు, ఫాస్టర్‌లు ఏసుక్రీస్తు జీవిత చరిత్ర గురించి వివరించారు .గుంత చియ్యపాడు చర్చిలో శనివారం రాత్రి ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. మాజీ ఎంపిటిసి, వైసిపియువ నాయకుడు దాసరి మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి టి లక్షుమయ్య, జడ్‌పిటిసి రాజీ, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, తహశీల్దార్ సుబానీ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. **వేంపల్లె :** స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న మదర్‌థెరిసా అనాథ వృద్ధులకు ఆమ్‌అద్మీ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం చేశారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ఆమ్ అద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షులు దాదాపీర్ ఆధ్వర్యంలో వృద్రశ్రమంలోని అనాథ వృద్ధులకు చేశారు. క్రిస్మస్ పండుగ రోజున వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. అనాథ వృద్ధులకు ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని కోరారు. వృద్ధులకు సేవా చేస్తున్న ఆశ్రమ నిర్వాహకుడు వెంకట సుబ్బయ్య సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆమ్ అద్మీపార్టీ నాయకులు మౌలాలి, ఫీరుబాష, గౌస్ బాబా, సలీం పాల్గొన్నారు. వేంపల్లెలోని కడప రోడ్డులోని సిఎస్ఐ చర్చిలో ఘనంగా కిస్మిస్ వేడుకలను నిర్వహించారు. చర్చి ఫాస్టర్ జోబ్ బాబు పండుగ సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో చర్చి పెద్దలు నాగన్న, సత్య మయ్య, నర్సయ్య, అంతోనీ, మాణిక్యరావు, క్రిష్టియన్ కాలనీ వాసులు పాల్గొన్నారు. **కడప :** కడప నగరంలోని 48 డివిజన్ కృపా కాలనీలో న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో పేదలకు పేదలకు చీరలు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పి.రవితేజ, శాంతిరాజు, ఏ.అగస్టిన్, రోజా, లీలావతి, అంజలి, రేణుక, అశోక్, తిమ్మప్ప అనేక మంది భక్తులు, చిన్నారులు పాల్గొని ప్రజా క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. **పోరుమామిళ్ల :**పట్టణంలోని పునీత జపమాల మాత దేవాలయంలో క్రీస్తు జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చర్చి ఫాదర్ జాల విజయ్ భాస్కర్, అనిల్ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు క్రీస్తు జననం మానవాళికి ఒక వరం అని పేర్కొన్నారు. ప్రేమా, క్షమా, దయ క్రీస్తు తత్వమని ప్రవచించారు. శాంటా క్లాస్ పిల్లలకు బహుమతులు, మిఠాయిలు పంచారు. క్రిస్మస్ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు.



ముద్దనూరు: క్రిస్మస్ బహుమతి అందజేస్తున్న గుణవంత్‌రెడ్డి

నిరాశ్రయుల వసతిగృహంలో

జమ్మలమడుగు : పట్టణంలోని సిరి నిరాశ్రయుల వసతి గృహంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా దాల్మియా సిమెంట్ పరిశ్రమ జనరల్ మేనేజర్ బి.శివశంకర్ హాజరయ్యారు. స్వాతి సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సిరి నిరాశ్రయుల వసతిగృహం నిర్వాహకులకు ముందుగా అభినందనలు తెలియజేశారు. ఫాలోవర్స్ చర్చ్ నిర్వాహకులు డాక్టర్ మేరీ ఫ్లోరెన్స్ చిన్నపిల్లలకు పుస్తకాల పంపిణీ చేశారు. అలాగే నిరాశ్రయులకు ఒక పూట భోజనాన్ని అందించారు. అనంతరం కేక్ కట్ చేసిన క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి, దాల్మియా వీఆర్వో కృష్ణారెడ్డి, ప్రభు, ఎంపీటీసీ కుమార్, 17వ వార్డు ఇంచార్జి బేపారి షామీర్ అలీ, నిరాశ్రయులు, యువకులు పాల్గొన్నారు.




జమ్మలమడుగు : సిరి నిరాశ్రయుల వసతి గృహంలో క్రిస్మస్ వేడుకలు

ముమ్మరం.. నీటి ట్యాంకు నిర్మాణం

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక అగ్రహారంలో తాగునీటి అవసరాల కోసం నిర్మించిన ట్యాంకు శిథిలమై ప్రమాదకర స్థితిలో ఉండేది. దాదాపు 35 ఏళ్ల క్రితం ట్యాంకు నిర్మించారు. ట్యాంక్ శిథిలం కావడంతో ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానిక ప్రజలు భయాందోళన చెందుతుండేవారు. ఈ సమస్యపై 'ప్రజాశక్తి'లో కథనాలు ప్రచురించారు. దీంతో ఎట్టకేలకు ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. కొత్త ట్యాంక్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అగ్రహారంలోని అంగన్వాడీ కేంద్రం సమీపంలో దాదాపు రూ.39 లక్షల వ్యయంతో నూతనంగా ట్యాంక్ నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది వేసవి నాటికి ముందే ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు, ప్రజా ప్రజలు కృషి చేస్తున్నారు. అగ్రహారం గ్రామానికి కొత్త ట్యాంక్ ఏర్పాటుకు స్థానిక నాయకులు గంగాధర్ రెడ్డి, తాగునీటి సరఫరా విభాగం ఇంజినీర్ ఉమామహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ట్యాంక్ మంజూరుకు కృషి చేశారు. కొత్త ట్యాంక్ ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



నిర్మాణంలో ఉన్న అగ్రహారం నీటి ట్యాంక్



తెలుగు మహాసభలలో ఓబులేసు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

మండల వాసికి ఘన సత్కారం

ప్రజాశక్తి - చాపాడు

ప్రపంచ తెలుగు మహాసభలలో చాపాడు మండల వాసి గుంతచీపాడుకు చెందిన పెరుగు ఓబులేసుకు ఘన సత్కారం లభించింది. 5వ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించారు. అతి ప్రాచీనమైన, గొప్పనైన తెలుగు భాషను పరిరక్షించుకోవాలన్నారు. ఓబులేసు రచించిన భారతీయ హృదయ భాష్యం శతకాన్ని తెలుగు మహాసభల వేదికపై మాజీ మంత్రి, తెలుగు మహా సభల అధ్యక్షులు మండలి బుద్ధ ప్రసాద్ ఆవిష్కరించి ప్రపంచ ప్రతినిధులకు పరిచయం చేసి, కవి ఓబులేసును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, జింకా సుబ్రమణ్యం, ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా)సిలికానాంధ్ర, పోలెండ్ ,ఫ్రాన్స్, దక్షిణాఫ్రికా ప్రతినిధులు పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్రదానం

ప్రజాశక్తి పులివెందుల రూరల్

పట్టణంలోని బంగారు అంగడి వీధిలో నివాసముంటున్న కాంబోజి లక్ష్మిదేవి (65) నేత్రదానం చేశారు. ఆమె శనివారం రాత్రి తన నివాసంలో మృతిచెందారు. ఆదివారం ఆమె కుమార్తెలు నాగేశ్వరి, రమాదేవి, నేత్రదానానికి అంగీకరిస్తూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజుకు సమాచారం అందించడంతో నేత్రనిధి టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృత దేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్ర నిధికి పంపారు. అనంతరం రాజు మాట్లాడుతూ తమ కుటుంబం లోని వ్యక్తి ద్వారా మరో ఇద్దరు అంధులకు చూపు ఇచ్చి వారి చీకటి జీవితంలో వెలుగులు చూపించాలని అనే ఆలోచన నిజం చేసుకోవాలి అంటే కేవలం నేత్రదానం చేస్తే చాలు అని చెప్పారు. కార్యక్రమంలో బంధువులు, సన్నిహితులు, సేవాసమితి సభ్యులు కాంబోజి కుటుంబ సభ్యులను అభినందించారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కంటి వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి -ఖాజీపేట

స్థానిక జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి తిరుపతి వారు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. మండల పరిధిలోని రావులపల్లె గ్రామానికి చెందిన గంగవరం రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం గంగవరం చంద్రమౌళీశ్వర రెడ్డి వైద్య శిబిరం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



చలికోటు అందజేస్తున్న తొడిమె రఘునాథరెడ్డి కుటుంబ సభ్యులు

విభిన్న ప్రతిభావంతులకు చలికోట్లు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ముసల్ రెడ్డిపల్లె కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు నాగిరెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కార్యాలయంలో సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఎం కార్యాలయ సహాయ సమన్వయకర్త తొడిమె రఘునాథరెడ్డి , వారి కుటుంబ సభ్యులు, కీ.శే. నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. తర్వాత నాగిరెడ్డి కుటుంబ సభ్యులు టి.వి. రాఘవేంద్ర రెడ్డి , చంద్రఓబులరెడ్డి సమకూర్చిన స్వెటర్లను 25 మంది విభిన్న ప్రతిభావంతులకు అందజేశారు. అనంతరం స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నియోజకవర్గం నెట్వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య ఉన్నారు.

పశువైద్యశాలలపై దృష్టి పెట్టలేరా..!

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని పలు గ్రామాల్లోని పశువైద్యశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పల్లవోలు, సీతారామపురం, చియ్యపాడు, అన్నవరం, చిన్నగురవలూరు, లక్ష్మీపేట, అనంతపురం, వెదురూరు, సోమాపురం గ్రామాల్లో పశువైద్యశాలలున్నాయి. వీటిలో పల్లవోలు, సీతారామపురం, చిన్న గురువలూరు, వెదురూరు భవనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సీతారామపురంలో భవనం వెనుక వైపు కూడా నాలుగేళ్ల క్రితం కురిసిన వర్షాలకు కూలిపోయింది. ప్రస్తుతం ఇక్కడ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఈ పశువైద్యశాల మూతపడింది. పల్లవోలులోని భవనం పైకప్పు చాలా వరకు దెబ్బతింది. సోమాపురంలోని భవనం పూర్తిగా దెబ్బ తినడంతో దాని స్థానంలో కొత్త బిల్డింగ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఐదేళ్ల క్రితం నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో మూతపడిన పాఠశాలలో పశువైద్యశాలను నిర్వహిస్తున్నారు. చిన్న గురువలూరులోని భవనాలు వర్షానికి ఊరుస్తూ స్లాప్ ఊడుతోంది. ఇక్కడ కూడా కొత్త బిల్డింగ్ నిర్మాణాన్ని చేపట్టి, నిధుల్లేవని పనులు మధ్యలోనే ఆపేశారు. వెదురూరులో నూతన భవనానికి నిధులు మంజూరైనప్పటికీ స్థల సమస్య ఎదురైంది. ఇక్కడ కూడా దెబ్బతిన్న భవనంలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా చిన్న గురువలూరు, సోమాపురంలో మధ్యలో ఆగిపోయిన భవనాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. పల్లవోలు, సీతారామపురం గ్రామాల్లో నూతన బిల్డింగులను ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



చిన్న గురువులూరులో అసంపూర్తిగా ఉన్న భవనం